మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 3-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 304 Issue: 304


Circulated to Telangana
Published from Jagitial

03 మే 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:53 సూర్యాస్తమయం - సా. 6:33 తిథి విదియ తె. 3:03ం వరకు తరువాత తదియ సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం విశాఖ ఉ. 7:03 వరకు తరువాత అనురాధ యోగం వారియ రా. 10:22 వరకు కరణం తైతుల మ. 1:55 వరకు గరజి తె. 3:03ం వరకు వర్జ్యం ఉ. 11:37 నుండి మ. 1:24 వరకు దుర్ముహూర్తం సా. 4:51 నుండి సా. 5:42 వరకు రాహుకాలం సా. 4:58 నుండి సా. 6:33 వరకు యమగండం మ. 12:13 నుండి మ. 1:48 వరకు గుళికాకాలం మ. 3:23 నుండి సా. 4:58 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:17 నుండి తె. 5:05 వరకు అమృత ఘడియలు రా. 10:19 నుండి రా. 12:07 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## రేపు తెలంగాణ కేబినెట్ భేటీ!

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): తెలంగాణ కేబినెట్ సోమవారం భేటీ కానున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోబోతోంది. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, రైతుల అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో ఈ -2 వ పేజీలో...



## 4 వరకు ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువును తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. ఫీజు గడువును ఈ నెల 4వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ -2 వ పేజీలో...



# విలయ వలయం

ఓఆర్ఆర్‌పై నెత్తుటి చారలు

2025లో 76 ప్రమాద ఘటనలు

హై స్పీడ్ వేగంతో దారుణాలు

రాత్రివేళల్లో కొరవడిన పెట్రోలింగ్

## ఐదేళ్లలో 400 మంది మృతి

హైదరాబాద్ నగరం చుట్టూ మణిహారంలా పరిఢవిల్లుతున్న 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు మృత్యుపాశంగా మారుతోంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ రహదారిపై గమ్యస్థానాలకు వేగంగా చేరుకోవచ్చన్న ఆనందం కంటే, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం ప్రయాణికులను వెంటాడుతోంది. నిత్యం జరుగుతున్న ఘోర ప్రమాదాలు, పదుల సంఖ్యలో పోతున్న ప్రాణాలు ఈ రహదారి భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.



హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): శుక్రవారం సిరిసిల్లకు చెందిన ఓ కుటుంబం కారులో వెళ్తూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టి అక్కడికక్కడే ప్రాణాలు వదిలడంతో, ఈ అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. వాస్తవానికి, ఓఆర్ఆర్‌పై జరుగుతున్న ప్రమాదాల్లో మెజారిటీ 'అతి వేగం' వల్లే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వెసులుబాటు ఉన్నప్పటికీ, ఆ పరిమితిని మించి వాహనాలు నడపడం ప్రాణాంతకమవుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో నిద్రమత్తు, మద్యం సేవించి వాహనాలు నడపడం, టైర్ల నాణ్యతను పట్టించుకోకపోవడం వల్ల ప్రమాద తీవ్రత పెరుగుతోంది. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనాలను వేగంగా వస్తున్న కార్లు ఢీకొట్టడం వల్ల ఇటీవలి కాలంలో ఎక్కువ మంది ప్రాణాలు తరువాయి 2 వ పేజీలో...




## సైరన్ మోగింది

భారీ శబ్దంతో ఫోన్‌కు మెసేజ్

దేశవ్యాప్తంగా మోగిన ఎన్డీఎంఏ అలారం

### కేంద్రం కీలక ముందడుగు

న్యూఢిల్లీ: ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో పౌరులను తక్షణమే అప్రమత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం దేశవ్యాప్తంగా ఒక కీలక వ్యవస్థను పరీక్షించింది. ఇందులో భాగంగా దేశంలోని -2 వ పేజీలో...


2

## ఫుల్ బాటిల్‌పై రూ.100 పెంపు!

భారీగా పెరగనున్న మద్యం ధరలు

కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి



# 100 రోజుల్లో 6000 కోట్లు

రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలు విడుదల చేస్తాం

పీఆర్సీ నివేదికను వెంటనే సమర్పించండి

జూన్ 1లోగా ఆరోగ్య భద్రత కార్డుల జారీ

ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. శనివారం ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమైన రేవంత్ రెడ్డి.. పలు కీలక అంశాలపై వారికి క్లారిటీ ఇచ్చారు. ఈ క్రమంలోనే పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలను 100 రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు. ఇందుకోసం రూ. 6వేల కోట్లు చెల్లిస్తామని ఉద్యోగ సంఘాల నేతలకు హామీ ఇచ్చారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యాలను ఉద్యోగులే నిర్ణయిస్తారని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని తరువాయి 2 వ పేజీలో...



## ప్రభుత్వ భూమిలో నమాజ్ హక్కు కాదు

ప్రజా శాంతి, నైతికతకు లోబడే మత స్వేచ్ఛ

సామూహిక ప్రార్థనలపై అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలు

ప్రభుత్వ భూములను నమాజ్ లేదా ఇతర పెద్ద ఎత్తున మతపరమైన కార్యక్రమాలు నిర్వహించడానికి హక్కుగా వినియోగించుకోలేరని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగం ప్రసాదించిన మత స్వేచ్ఛ హక్కుకు ప్రజాశాంతి, నైతికత, ఇతరుల హక్కులు వంటి పరిమితులు వర్తిస్తాయని ధర్మాసనం తేల్చిచెప్పింది.

సంభాల్: ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లా ఇకౌనా గ్రామంలోని ఓ స్థలంలో నమాజ్ చేసుకునేందుకు అనుమతి కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ గరిమా ప్రసాద్, జస్టిస్ సరళ్ శ్రీవాస్తవతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అసీన్ అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను కోర్టు తరువాయి 2 వ పేజీలో...




| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,044 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,902 |

## విశ్వవాణి



1724లో స్కాట్లాండ్‌కు చెందిన ఓ మహిళ తనకు పుట్టిన బిడ్డను చిదిమేసింది. దీంతో అక్కడి ప్రభుత్వం ఆమెకు ఉరిశిక్ష విధించింది. ఆమెను ఉరితీసి, ఒక శవపేటికలో పెట్టారు. అయితే, ఆ తర్వాత కూడా కదులుతూ కనిపించింది. చట్ట ప్రకారం ఆమెను ఉరి తీయడం పూర్తి కావడంతో, ఆమెను అక్కడి ప్రభుత్వం వదిలేసింది. ఆ తర్వాత ఆమె మరో 40 ఏళ్లు బతికింది.



## అమ్మలా లాలిస్తా

ప్రజలకు అసలైన పాలన అందిస్తా.. పూర్తి ఉచిత విద్యను అమలు చేస్తా

ప్రతి వ్యక్తికి నాణ్యమైన వైద్యం అందిస్తా.. మీట్ ది ప్రెస్‌లో కల్వకుంట్ల కవిత

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్'లో మాట్లాడిన ఆమె, రాష్ట్రంలోని అన్ని వర్గాల రక్షణే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కవిత స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వాలకు 'అమ్మలా' ఆలోచించే హృదయం లేదని కవిత విమర్శించారు.

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): "నేను అమ్మలా పరిణితి చెందుతానని అంటే చాలా మంది ఎగతాళి చేశారు. కానీ అమ్మలా లాలించి పాలన చేసినప్పుడే ప్రజలకు అసలైన న్యాయం జరుగుతుంది" అని ఆమె స్పష్టం చేశారు. సామాన్యుడి ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యానికే ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేసిన కవిత, తమ పార్టీ అధికారంలోకి వస్తే విప్లవాత్మక మార్పులు చేస్తామని హామీ తరువాయి 2 వ పేజీలో...

## కవితతో పార్టీ పెట్టించిందే రేవంత్



కేసీఆర్‌ను తిట్టేందుకే టీఆర్ఎస్.. ధర్మపురి అర్వింద్ విమర్శలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తిట్టించడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కవితతో పార్టీని పెట్టించారని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సంచలన ఆరోపణలు చేశారు. కవిత స్థాపించిన 'టీఆర్ఎస్' ప్రభావం కేసీఆర్, కేటీఆర్ పైనే ఉంటుందని అన్నారు. ఇక ఏ పార్టీపై ప్రభావం ఉండదని అభిప్రాయపడ్డారు. కవిత పార్టీకి రేవంత్ రెడ్డి అండ ఉందని ఆరోపించారు. మద్యం పాలసీ కేసులో ఆమెకు క్లీన్ చిట్ రాలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం సీబీఐ విచారణ కొనసాగుతోందని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కవిత టీఆర్ఎస్ పార్టీతో ఎవరి పైనా ప్రభావం ఉండదని అన్నారు.

నిజామాబాద్, మే 2 (ఈవార్తలు): బీజేపీకి మాత్రం మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 10న తెలంగాణలో మోదీ పర్యటన ఉందని అన్నారు. మోదీ పర్యటనతో కేసీఆర్, రేవంత్ రెడ్డితో పాటు ఆయా పార్టీల్లో వణుకు పుడుతోందని విమర్శించారు. 2028 ఎన్నికలకు నాంది ఈ మోదీ పర్యటన అన్నారు. బీజేపీ ఇప్పటికే దేశమంతా జెండా ఎగురవేసిందని, ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లోనూ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ వరుస విజయాలతో ప్రాంతీయ పార్టీల్లో వణుకు ఖాయమని అన్నారు. బీజేపీ తదుపరి లక్ష్యం తెలంగాణ అన్నారు. ప్రాంతీయ పార్టీల్లో ప్రస్తుతం అభద్రతాభావం నెలకొని ఉందని, మరోవైపు కాంగ్రెస్ పార్టీని తరువాయి 2 వ పేజీలో...



## రూ.1.8 లక్షల కోట్ల ఈటీఎఫ్ పెట్టుబడులు

ముంబై: దేశీయ పెట్టుబడుల రంగంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. భౌగోళిక రాజకీయ పరిణామాల మధ్య క్రమంగా ఈటీఎఫ్‌లకు అత్యంత ఆదరణ పెరుగుతోంది. తాజాగా జెరొధా ఫండ్ -2 వ పేజీలో...

## బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐలు




ఎల్ఐసీలో 20 శాతానికి పరిమితి

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈవార్తలు



## రాశి ఫలాలు

3.5.2026

మేషం: కుటుంబ సభ్యులతో శుభకార్య విషయమై చర్చలు జరుగుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. నూతన వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

వృషభం: వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగస్తులు అధికారుల ఆగ్రహానికి గురికావల్సి వస్తుంది. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. సంతాన ఆరోగ్య విషయాలలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

మిధునం: ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. గృహమున గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది.

కర్కాటకం: బంధుమిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు లభిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరినీ ఆకట్టుకుంటారు.

సింహం: చేపట్టిన పనులు మందగిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఇంటాబయట చికాకులు పెరుగుతాయి. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులతో స్వల్ప విభేదాలు కలుగుతాయి. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది.

కన్య: చేపట్టిన వ్యవహారాలలో ఆకస్మికంగా విజయం సాధిస్తారు. గృహమున బంధు మిత్రులతో ఆనందంగా గడుపుతారు. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. దీర్ఘకాలిక ఋణ సమస్యల నుండి బయటపడతారు. వృత్తి ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

## అమ్మలా లాలిస్తా

మొదటి పేజీ తరువాయి

ఇచ్చారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా వారు ఎంత వరకు చదువుతారో అంత వరకు పూర్తి ఉచిత విద్యను అందిస్తామని, దీనికి సంబంధించిన ఆర్థిక ప్రణాళిక తమ వద్ద సిద్ధంగా ఉందని వెల్లడించారు. తమ ప్రభుత్వం వస్తే... క్యాన్సర్ వంటి మహమ్మారి సోకితే నిరుపేదలు ప్రాణాలు వదులుకోవాల్సిన అవసరం లేదని, ఎంత ఖర్చైనా సరే ప్రభుత్వమే భరించి ప్రతి బిడ్డకు నాణ్యమైన వైద్యం అందిస్తుందని భరోసా ఇచ్చారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద ప్రాణాలు విడుస్తుండటం తనను కలచివేసిందని కవిత అన్నారు. ధాన్యం ఎగుమతి కోసం ప్రత్యేక కమిటీ వేసి రైతులకు మద్దతు ధరతో పాటు ఆత్మగౌరవం కల్పిస్తామన్నారు. యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. 18-45 ఏళ్ల యువతకు వారి ఐడియాలజీ ఆధారంగా రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామని ప్రకటించారు. సచివాలయం వంటి భారీ కట్టడాల్లో వికలాంగుల కోసం కనీసం ర్యాంప్‌లు, ప్రత్యేక టాయిలెట్లు లేకపోవడం దారుణమన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు ఉచిత ప్రయాణం కల్పించకపోవడాన్ని ఆమె తప్పుపట్టారు.

### ఎన్జీవోగా తెలంగాణ జాగృతి

తెలంగాణ జాగృతి సంస్థ ఇకపై ఎన్జీవోగా పనిచేస్తుందని, తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెన్ జీ యువతే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని కవిత వెల్లడించారు. తెలంగాణ ఉద్యమకారులను గౌరవించుకునే క్రమంలో లక్ష సూపర్ న్యూమరికల్ ఉద్యోగాలను క్రియేట్ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే 'పాంచజన్యం' పేరుతో ప్రజల్లోకి వెళ్తామని, సర్వోదయ తెలంగాణే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎంతటి పెద్ద జబ్బు చేసినా పేదలకు నాణ్యమైన వైద్యం, విద్యను పూర్తిగా ఉచితంగా అందించడమే తమ విధానమని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రైతులు ధాన్యం కుప్పలపైనే ప్రాణాలు విడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వస్తే రైతులకు ధాన్యం అమ్ముకునే విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి ఇక్కడ ఉన్నా, ఆయన సిమ్ కార్డు మాత్రం ఢిల్లీలో ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని... మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌లు, ఓవర్ సీస్ స్కాలర్‌షిప్‌ల గురించి సీఎం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సెక్రటేరియట్‌లో దివ్యాంగుల కోసం కనీస సౌకర్యాలు లేకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. సాధారణ పరిస్థితుల్లో 800 రోజులు, బోనస్ రోజులు కలిపితే మరో 1000 రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని.. ఈ వెయ్యి రోజులు కాళ్లకు బలపం కట్టుకుని తిరుగుతామని కవిత ప్రకటించారు. కాంగ్రెస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని చెప్పారు.

## రేపు తెలంగాణ కేబినెట్ భేటీ!

మొదటి పేజీ తరువాయి

అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే ప్రభుత్వ అధికారుల సంఘం నేతలతో సీఎం భేటీ అయ్యి వరాలు ప్రకటించారు. దీంతో ఎల్లుండి జరగబోయే కేబినెట్ భేటీలో ప్రభుత్వ ఉద్యోగులకు భారీ తీపి కబురు ఉండబోతోందా అనే చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.




# విలయ వలయం

మొదటి పేజీ తరువాయి

కోల్పోతున్నారు.కేవలం వాహనదారుల తప్పిదాలే కాదు, వ్యవస్థాగత లోపాలు కూడా దీనికి కారణమవుతున్నాయి. రాత్రి వేళల్లో సరైన వెలుతురు లేకపోవడం, హెచ్ఎండీఏ పర్యవేక్షణ లోపించడం, పెట్రోలింగ్ వాహనాల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించే 'గోల్డెన్ అవర్' వైద్య సదుపాయాలు కొన్ని చోట్ల సరిగా లేకపోవడం మరణాల సంఖ్య పెరగడానికి ఒక కారణం.ప్రభుత్వం కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా ఉపయోగించుకోవాలి. ప్రతి కిలోమీటరుకు స్పీడ్ గన్‌లు, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలి. రోడ్డు పక్కన వాహనాలు నిలపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలు (2024 - 2026 మే నాటికి):

గత ఐదేళ్లలో మరణాలు: గత ఐదు సంవత్సరాలలో ఓఆర్‌ఆర్ పై దాదాపు 369 నుండి 400 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు.

రాచకొండ పరిధిలో పెరుగుదల: రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఓఆర్‌ఆర్ పై 2024లో 52 ప్రమాదాలు జరగగా, 2025 నాటికి అవి 76కి పెరిగాయి. అదేవిధంగా మరణాల సంఖ్య 21 నుండి 37కి పెరిగింది.

ప్రమాదాల ధోరణి: 2016 నుండి 2025 జూలై వరకు జరిగిన మొత్తం 10,666 ప్రమాదాలలో, దాదాపు 57% (6,086 ప్రమాదాలు) పగటిపూటే జరగడం గమనార్హం.

ఇటీవలి ఘోర ప్రమాదం (మే 1, 2026): శంషాబాద్ ఎగ్జిట్ నంబర్ 16 వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మరణించారు.

ప్రధాన కారణం: దాదాపు 70% ప్రమాదాలకు 'అతి వేగం' ప్రధాన కారణమని అధికారులు గుర్తించారు. 2023లో గరిష్ట వేగ పరిమితిని 120 కిలోమీటర్లకు పెంచిన తర్వాత ప్రమాదాల తీవ్రత పెరిగినట్లు విశ్లేషణలు చెబుతున్నాయి.

**సంవత్సరాల వారీగా ఓఆర్‌ఆర్ ప్రమాదాల వివరాలు:**

| సంవత్సరం | ప్రమాదాల సంఖ్య | మరణాలు |
|---|---|---|
| 2023 | 216 | ది100 (గత 2 ఏళ్లలో కలిపి) |
| 2024 | 223 | 62 |
| 2025 | పెరుగుదల నమోదు 30కి పైగా (జూలై నాటికి) | |

## ఫుల్ బాటిల్‌పై రూ.100 పెంపు!

**భారీగా పెరగనున్న మద్యం ధరలు.. కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిడి**

పెంపుతో ఏటా 3,000 కోట్ల అదనపు ఆదాయం

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): మద్యం ప్రియులకు త్వరలో షాక్ తగలబోతోంది. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. పెరిగిన ఉత్పత్తి వ్యయం, డిస్టలరీల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నెలలోనే కొత్త ధరలపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ పెంపు అమలైతే ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.100 వరకు భారం పడొచ్చని అంచనా. గత ఏడాది కాలంగా మద్యం తయారీ కంపెనీలు ధరల పెంపు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడం, ముడిసరుకుల రవాణా ఖర్చులు, బాటిళ్ల తయారీకి వినియోగించే గ్యాస్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రతిపాదనలను పక్కన పెట్టింది. అయితే, ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరల పెంపునకు సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ధరల నిర్ధారణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఎక్సైజ్ శాఖ ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వచ్చే వారం తొలిసారి సమావేశమై, వివిధ బ్రాండ్ల ధరల పెంపుపై కంపెనీలు సమర్పించిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించనుంది. అయితే, ధరలను భారీగా పెంచితే సామాన్యుల నుంచి వ్యతిరేకత వస్తుందని, గ్రామాల్లో అక్రమ గుడుంబా తయారీ పెరిగే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకే, మధ్యేమార్గంగా ధరలను సవరించాలని యోచిస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం.. సాధారణ బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.60, ప్రీమియం బ్రాండ్లపై రూ.100, ఖరీదైన బ్రాండ్లపై రూ.120 వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ ధరల పెంపు ద్వారా ప్రభుత్వ ఖజానాకు నెలకు అదనంగా రూ.250 కోట్లు, ఏడాదికి సుమారు రూ.3,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని ఎక్సైజ్ అధికారులు లెక్కలు వేస్తున్నారు. సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి ధరలను సవరించే ఆనవాయితీ ఉండగా.. 2023 మే నెలలో గత ప్రభుత్వం ధరలు పెంచింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

### 100 రోజుల్లో 6000 కోట్లుం

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. మరోవైపు ఉద్యోగుల పీఆర్సీ విషయంలోనూ సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగ సంఘాల నేతలకు క్లారిటీ ఇచ్చారు. పీఆర్సీకి సంబంధించిన నివేదికను వెంటనే సమర్పించాలని అధికారుల కమిటీని ఆదేశించామన్న రేవంత్ రెడ్డి.. నివేదిక రాగానే పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. జూన్ ఒకటో తేదీలోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల గురించి రెండు నెలలకు ఓసారి ఉద్యోగ సంఘాలు సమావేశమై, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఉద్యోగుల సహకారంతోనే సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి.. ఉద్యోగుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి వివరించారు. ప్రణాళిక ప్రకారం, ఎలాంటి గందరగోళాలకు తావులేకుండా ఉద్యోగుల బదిలీలు పూర్తి చేశామని.. ఉద్యోగ సంఘాలు ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూశామని వివరించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలనూ వివాదాలు లేకుండా పూర్తి చేసామని రేవంత్ రెడ్డి వివరించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం తర్వాత.. నిరసన కార్యక్రమాలను నిలిపివేస్తున్నట్లు ఉద్యోగుల జేఏసీ వెల్లడించింది. ఈ విషయాన్ని జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్, టీజీఈజేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి ప్రకటించారు.

## కవితతో పార్టీ పెట్టించిందే రేవంత్

మొదటి పేజీ తరువాయి

ప్రజలు మరిచిపోయారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే విపక్షాలు వ్యతిరేకించాయని మండిపడ్డారు. దీనితో మహిళ బిల్లుకు ఎవరు వ్యతిరేకమో ప్రజలకు తెలిసిందని అన్నారు. ప్రధాని మోదీకి తెలంగాణ ప్రజలపై అమితమైన ప్రేమ ఉందని అన్నారు.

### ఉత్తమ్ కేసీఆర్ కోవర్ట్

కాంగ్రెస్ నేతలపై అర్వింద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గ్యాస్ ధరల పెరుగుదలపై రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను 'పిల్ల చేష్టలు'గా అభివర్ణించారు. కనీసం దుస్తులు, చెప్పులు కూడా సరిగా వేసుకోవడం తెలియని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష నేతగా ఉండటం సిగ్గుచేటంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి చేపట్టిన తర్వాత ప్రజాక్షేమం కంటే తన కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారని అర్వింద్ ఆరోపించారు. రేవంత్ పాలనలో రాష్ట్రానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని ఆయన విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు 'కోవర్ట్' అని సంబోధిస్తూ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని శాఖల కంటే సివిల్ సప్లై శాఖలోనే భారీగా అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కూడా కేసీఆర్ మనుషులనే ఉద్యోగులుగా కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కంటే ఉత్తమ్ శాఖలో జరుగుతున్న అవినీతి పెద్దదని ఆయన వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అక్రమాల విషయంలో కేసీఆర్ కుటుంబాన్ని రక్షించేందుకు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు.

## 4 వరకు ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు

మొదటి పేజీ తరువాయి

రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు ఎల్లుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఫీజును చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే లేట్ ఫీజును రూ.3,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మే 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలు రెండు సెషన్‌లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. మే 22 నుంచి 25వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి

## బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలు

**ఎల్ఐసీలో 20 శాతానికి పరిమితి**

**కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. బీమా రంగంలో కూడా ఏకంగా 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ( ఖీణ× ) అనుమతి ఇచ్చింది కేంద్రం. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 2026, మే 2న సర్క్యులర్ నోటిఫై చేసింది. ఇది ఇన్సూరెన్స్ సెక్టార్‌లో చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణిస్తున్నారు. కొద్ది రోజుల కిందట చైనా నుంచి కూడా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి ఆంక్షల్ని సడలించింది కేంద్రం. ఇప్పుడీ నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయంతో.. 100 శాతం ఎఫ్‌డీఐకి.. ఆటోమేటిక్ రూట్‌లో అనుమతి కల్పించినట్లయింది. ఇప్పటివరకు ఈ పరిమితి 74 శాతంగానే ఉంది. చివరగా 2021లో బీమా రంగంలో.. ఎఫ్‌డీఐ పరిమితిని 49 నుంచి 74 శాతానికి పెంచారు. అంతకుముందు 2015కు ముందు ఇది 24 శాతంగానే ఉండేది. ఆటోమేటిక్ రూట్ అంటే.. విదేశీ పెట్టుబడుల కోసం ఇకపై ముందస్తుగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇందుకు వీలు కల్పించేలా గతంలోనే పార్లమెంటు.. సబ్ కా బీమా సబ్ కీ రక్ష (బీమా చట్టాల సవరణ) బిల్లు-2025 ను ఆమోదించింది. ఇక మీదట బీమా కంపెనీల్లో కూడా విదేశీ సంస్థలు గరిష్ఠంగా 100 శాతం వరకు వాటా కలిగి ఉండవచ్చు. ఇదిలా ఉండగా.. భారత్‌లో అతిపెద్ద బీమా సంస్థ.. ప్రభుత్వ రంగానికి చెందిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మాత్రం సెపరేట్ ఫ్రేమ్ వర్క్ ఉంది. ఇక్కడ 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతి లేదు. ఇందులో గరిష్ఠంగా 20 శాతం వరకు పరిమితి విధించింది. అంటే.. ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడుల పరిమితి 20 శాతంగానే ఉందన్నమాట. ఇది ఎల్ఐసీ చట్టం, 1956 నిబంధనలకు లోబడి ఉంటుంది. ఇక్కడ మరో రూల్ ఏంటంటే.. బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐకి అనుమతి కల్పించినప్పటికీ.. సదరు కంపెనీల ఛైర్మన్ లేదా ఎండీ లేదా సీఈఓల్లో ఒక్కరైనా కనీసం భారత నివాసి అయి ఉండాలి. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల.. బీమా రంగంలో పోటీ మరింత పెరిగి.. అప్పుడు తక్కువ ప్రీమియంతో మెరుగైన పాలసీలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. బీమా రంగంలో మరిన్ని కంపెనీలు అడుగుపెట్టేందుకు కూడా ఈ నిర్ణయం ఉపకరించనుంది.

## ప్రభుత్వ భూమిలో నమాజ్ హక్కు కాదు

మొదటి పేజీ తరువాయి

కొట్టివేసింది. గిఫ్ట్ డీడ్ ద్వారా ఆ భూమి తనకే చెందిందని, అక్కడ ప్రార్థనలు చేసుకోకుండా అధికారులు అడ్డుకుంటున్నారని పిటిషనర్ వాదించారు. అయితే, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ వాదనను వ్యతిరేకించింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం అది ప్రజా అవసరాల కోసం కేటాయించిన 'ఆబాదీ భూమి' అని కోర్టుకు తెలిపింది. పిటిషనర్ చూపిన గిఫ్ట్ డీడ్‌లో భూమికి సంబంధించిన సరైన గుర్తింపు వివరాలు లేవని పేర్కొంది. గతంలో ఈద్ రోజున మాత్రమే అక్కడ ప్రార్థనలు జరిగేవని, దానికి ఎలాంటి ఆంక్షలు లేవని ప్రభుత్వం వివరించింది. అయితే, పిటిషనర్ కొత్తగా ఇతర గ్రామాల వారిని కూడా పిలిచి రోజూ సామూహిక ప్రార్థనలు మొదలుపెట్టాలని చూస్తున్నారని, ఇది స్థానికంగా సామాజిక సమతౌల్యతను దెబ్బతీస్తుందని ఆరోపించింది. ఈ వాదనలను పరిశీలించిన ధర్మాసనం, ప్రజా శాంతికి విఘాతం కలిగే అవకాశం ఉందని భావిస్తే, ముందస్తు చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. పిటిషనర్ తన యాజమాన్యాన్ని నిరూపించడంలో విఫలమవడంతో పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. వ్యక్తిగత ప్రార్థనలకు, సామూహిక మతపరమైన కార్యక్రమాలకు మధ్య తేడా ఉంటుందని కోర్టు తన తీర్పులో పేర్కొంది.

## సైరన్ మోగింది

మొదటి పేజీ తరువాయి

పలువురి మొబైల్ ఫోన్లకు ఉదయం 11.46 నిమిషాలకు భారీ శబ్దంతో, వైబ్రేషన్‌తో కూడిన ఒక ఎమర్జెన్సీ అలర్ట్ మెసేజ్ వచ్చింది. దీంతో చాలామంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయితే, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది కేవలం ఒక పరీక్ష మాత్రమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. 'సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్' పేరుతో రూపొందించిన ఈ వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికే ఈ పరీక్ష నిర్వహించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) ఈ దేశవ్యాప్త పరీక్షను చేపట్టింది. భూకంపాలు, సునామీలు, పిడుగుపాట్లు వంటి ప్రకృతి విపత్తులతో పాటు, గ్యాస్ లీక్‌లు లేదా రసాయన ప్రమాదాల వంటి మానవ తప్పిదాల సమయంలోనూ నిర్దిష్ట భౌగోళిక ప్రాంతంలోని మొబైల్ వినియోగదారులకు తక్షణమే హెచ్చరికలు పంపడం ఈ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం. ఈ ఇంటిగ్రేటెడ్ అలర్ట్ సిస్టమ్ ను పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ అభివృద్ధి చేసింది. ఇది అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) సిఫార్సు చేసిన కామన్ అలర్టింగ్ ప్రోటోకాల్ (సీఏపీ) ఆధారంగా పనిచేస్తుంది. గతంలో కూడా ప్రభుత్వం ఈ వ్యవస్థను కొన్నిసార్లు పరీక్షించినప్పటికీ, దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో దీన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ముందు వ్యవస్థ పనితీరును, విశ్వసనీయతను అంచనా వేయడంలో భాగంగానే తాజా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షా సందేశాలు సెల్ బ్రాడ్‌కాస్ట్ టెస్ట్ ఛానెల్స్ ఎనేబుల్ చేసుకున్న మొబైల్ ఫోన్లకు అందాయి. దేశవ్యాప్తంగా పరీక్షలు పూర్తయిన తర్వాత ఈ మొబైల్ అలర్ట్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు.

## రూ.1.8 లక్షల కోట్ల ఈటీఎఫ్ పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి

హౌస్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈటీఎఫ్‌లు రికార్డు స్థాయిలో రూ.1.8 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించాయి. ఇది గతంలో నమోదైన ఏ సంవత్సరంతో పోల్చినా రెట్టింపు కంటే ఎక్కువ. ఇప్పటివరకు ఈటీఎఫ్‌లు ఈక్విటీ మార్కెట్‌కే పరిమితం అయ్యేవి. కానీ ఇప్పుడు పెట్టుబడిదారుల దృష్టి క్రమంగా మారుతోంది. అయితే, ఈ పెట్టుబడులు ప్రధానంగా గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లలోకే వెళ్తుండటం విశేషం. మొత్తం పెట్టుబడుల్లో 55 శాతం వాటా వీటిలోకే వెళ్తున్నాయి. అంటే, ఈక్విటీ ఈటీఎఫ్‌లనులను కూడా మించి కమోడిటీ ఈటీఎఫ్‌లే ఎక్కువ నిధులను ఆకర్షిస్తున్నాయి. అస్థిరంగా మారిన అంతర్జాతీయ పరిస్థితులు, మార్కెట్ అనిశ్చితి నేపథ్యంలో పెట్టుబడిదారులు భద్రత కోసం బంగారం, వెండి వైపు మొగ్గు చూపుతున్నారని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. సమీక్షించిన కాలంలో ఒక్క గోల్డ్ ఈటీఎఫ్‌లలోకే రూ. 68,868 కోట్లు(38 శాతం), సిల్వర్ ఈటీఎఫ్‌లలోకి రూ. 30,412 కోట్లు(16.8 శాతం), ఈక్విటీల్లోకి రూ. 77,780 కోట్లు(42.9 శాతం), డెట్‌లోకి రూ. 4,066 కోట్లు(2.2 శాతం) వచ్చాయి.



# 10న కాకతీయ మెగా పార్క్ ప్రారంభం

**హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న మోదీ.. 6,000 కోట్లకు పైగా పెట్టుబడులు.. 24,400 మందికి ఉపాధి అంచనా**

వరంగల్, మే 2 (ఈవార్తలు): వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 10వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ ఈ పార్క్‌ను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. హైదరాబాద్ నుంచి ప్రధాని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ప్రపంచ స్థాయి సమీకృత టెక్స్‌టైల్ హబ్‌గా ఈ పార్కును తీర్చిదిద్దినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ పార్కు ద్వారా టెక్స్‌టైల్ తయారీ, ఉపాధి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ '5ఎఫ్' (ఫామ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారెన్) దార్శనికతకు అనుగుణంగా టెక్స్‌టైల్ విలువ గొలుసును బలోపేతం చేసేందుకు ఈ పార్కును అభివృద్ధి చేసినట్లు వివరించారు. దాదాపు 1,327 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ పార్కు దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 1,695.54 కోట్లు కాగా, దీని ద్వారా రూ. 6,000 కోట్లకు పైగా పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రూ. 3,800 కోట్లకు పైగా పెట్టుబడులు ఖరారైనట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. పార్కులోని 62 శాతం స్థలాన్ని యాంకర్ ఇన్వెస్టర్లకు కేటాయించినట్లు తెలిపారు. ఈ మెగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత 24,400 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. ఇప్పటికే దాదాపు 2,000 ఉద్యోగాలు సృష్టించబడ్డాయని కిషన్ రెడ్డి తెలిపారు. అంతర్గత రోడ్లు, వీధి దీపాలు వంటి పనులు పూర్తయ్యాయని, 232 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, 12 ఎమ్ఎల్‌డీ నీటి సరఫరా వ్యవస్థ, వ్యర్థ జల శుద్ధి ప్లాంటు వంటి కీలకమైన మౌలిక సదుపాయాల పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. తెలంగాణలోని వరంగల్‌తో పాటు తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నారు.



## ఆర్టీసీ సిబ్బంది గొడవలు పెట్టుకోవద్దు: పొన్నం

**అధికారులు డ్రైవర్లు, కండక్టర్ల పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని సూచన**

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): ఆర్టీసీ సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్టీసీ అధికారులు కూడా కిందిస్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించవద్దని అన్నారు. స్నేహపూర్వకంగా ఉండి వారితో పనిచేయించుకోవాలని తెలిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని అన్నారు. ఖమ్మం, మెదక్, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లెందు లాంటి కొన్ని డిపోలు ఎందుకు నష్టాల్లో నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్లు సమీక్షించాలని ఆదేశించారు. ఆర్టీసీ యాజమాన్యం సిబ్బంది సమస్యలు సావధానంగా వినాలని సూచించారు. టిక్కెట్లకు సంబంధించి ఏదైనా ఇబ్బందులు, సమస్యలు ఏర్పడితే వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఎయిర్‌పోర్టులో షకీల్ కుమారుడి అడ్డగింత

శంషాబాద్, మే 2 (ఈవార్తలు): హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో గతంలో జరిగిన హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహెల్‌కు పోలీసుల నుంచి చుక్కెదురైంది. దుబాయ్ వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకుని విమానాశ్రయానికి చేరుకున్న అతడిని జూబ్లీహిల్స్ పోలీసులు ఎయిర్‌పోర్టులోనే అడ్డుకున్నారు. మూడేళ్ల క్రితం నమోదైన ఈ కేసులో ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయిన రాహెల్, ప్రస్తుతం షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్నారు. అయితే కేసు విచారణ ఇంకా కొనసాగుతుండటంతో, కోర్టు ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడం చట్టవిరుద్ధమని పోలీసులు స్పష్టం చేశారు. రాహెల్ విదేశీ ప్రయాణానికి సిద్ధమైనట్లు ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు సమయానుకూలంగా స్పందించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణ పెండింగ్‌లో ఉన్నందున ప్రయాణాలకు కోర్టు అనుమతి తప్పనిసరి అని పోలీసులు ఈ సందర్భంగా తేల్చి చెప్పారు.

# మోదీ సభకు టీబీజేపీ భారీ ఏర్పాట్లు

**గోడపై నినాదాలు రాసి ప్రచారం ప్రారంభించిన కిషన్ రెడ్డి.. కమలం పువ్వు గుర్తును చిత్రించిన కేంద్రమంత్రి**

హిమాయత్‌నగర్-హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి గోడలపై నినాదాలు రాసి అందరినీ ఆశ్చర్యపరిచారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఈ ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీన సాయంత్రం 4 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ పాల్గొనే భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు ప్రజలను ఆహ్వానిస్తూ "ఛలో పరేడ్ గ్రౌండ్స్" అంటూ కిషన్ రెడ్డి స్వయంగా కుంచె పట్టి గోడపై రాశారు. అనంతరం బీజేపీ ఎన్నికల గుర్తు అయిన కమలం పువ్వును కూడా ఆయనే చిత్రించడం విశేషం. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అభివృద్ధి, పురోగతి దార్శనికతపై ప్రజలు,






కార్యకర్తలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, వారి ఉత్సాహమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి స్వయంగా వాల్ రైటింగ్ చేస్తున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# అత్తను హెల్మెట్‌తో కొట్టి చంపిన అల్లుడు!

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): భార్యపై ఉన్న కోపాన్ని అత్తపై ప్రదర్శించి, ఆమె ప్రాణాలు తీశాడో కిరాతక అల్లుడు. ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయిందని అందరినీ నమ్మించాలని చూసినా, చివరకు సీసీ కెమెరా ఫుటేజ్ రూపంలో నిజం నిగ్గుతేలింది. ఈ దారుణ ఘటన మేడ్చల్ జిల్లా చెంగిచర్లలో చోటుచేసుకుంది. చెంగిచర్ల ఆర్టీసీ కాలనీకి చెందిన కొల్ల అరుణ (39)కు ఇద్దరు కుమార్తెలు. ఆమె చిన్న కుమార్తె కావ్య (19), కరీంనగర్‌కు చెందిన కర్రు స్నేహిత్ (28)ను గతేడాది ప్రేమ వివాహం చేసుకుంది. అయితే, కొంతకాలంగా వారిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలోనే గత నెల 29న రాత్రి స్నేహిత్ అత్త అరుణకు ఫోన్ చేసి, "నేనొక పెద్ద కంపెనీలో ఆఫీసర్‌ని. మీ కూతుర్ని పెళ్లి చేసుకున్నాను. కానీ, తను చిన్న విషయాలకే గొడవపడుతోంది" అంటూ తీవ్ర స్వరంతో




మాట్లాడాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజు (ఏప్రిల్ 30) మధ్యాహ్నం, దుకాణానికి వెళ్లి వస్తున్న అరుణను స్నేహిత్ తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. మార్గమధ్యంలో చెంగిచర్లలోని హనుమాన్ ఆలయం సమీపంలో బైక్ ఆపి ఆమెతో గొడవపడ్డాడు. మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో ఊగిపోయిన స్నేహిత్, తన హెల్మెట్‌తో అరుణ తలపై బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు ఆమె బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడింది. వెంటనే అతను తన భార్య కావ్యకు ఫోన్ చేసి, "అత్తమ్మకు ఫిట్స్ వచ్చి బండి మీద నుంచి కిందపడిపోయింది. ఆసుపత్రికి తీసుకెళుతున్నాను" అని కట్టుకథ అల్లాడు. హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్న కావ్య, చికిత్స పొందుతూ తల్లి అరుణ మరణించడంతో కన్నీరుమున్నీరైంది. అయితే, భర్త ప్రవర్తనపై అనుమానం రావడంతో ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించింది. ఆ ఫుటేజ్‌లో స్నేహిత్ తన తల్లిని హెల్మెట్‌తో కొట్టడం స్పష్టంగా రికార్డవడంతో ఆమె దిగ్భ్రాంతికి గురైంది. తన తల్లి మృతికి భర్తే కారణమని నిర్ధారించుకున్న కావ్య, పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అత్తను హత్య చేసిన ఈ దారుణానికి సంబంధించిన సీసీ ఫుటేజ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## కాంగ్రెస్‌కు మరో 20 ఏళ్లు ఓట్లేయరు: కేటీఆర్

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, అవినీతి, కుంభకోణాలను చూసి ప్రజలు మరో ఇరవై ఏళ్లు ఆ పార్టీకి ఓటు వేయరని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల అవినీతి బాగా పెరిగిపోయిందని అన్నారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు చేతులెత్తేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలు చూసిన ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అన్నారు. నిన్న మోదీ ప్రభుత్వం వాణిజ్య సిలిండర్‌పై సుమారు రూ.993 పెంచిందని, ప్రజా వ్యతిరేక విధానాలకు ఇదే నిదర్శనమని అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఎక్కడికక్కడ నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్యే కాటిపెల్లిపై పరువు నష్టం దావా

కామారెడ్డి, మే 2 (ఈవార్తలు): కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కుమారుడు ఇలియాస్ పరువు నష్టం దావా వేశారు. తన పరువుకు భంగం కలిగేలా ఎమ్మెల్యే ఆరోపణలు చేశారంటూ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో దావా వేశారు. దీనితో, ఈ నెల 20న హాజరుకావాలంటూ ప్రత్యేక కోర్టు సమన్లు జారీ చేసింది. శనివారం కామారెడ్డిలో హైకోర్టు న్యాయవాది సుమంత్ మాట్లాడుతూ, ఎమ్మెల్యేకు నోటీసులు జారీ అయినట్లు తెలిపారు. గత ఫిబ్రవరి 17, 21వ తేదీల్లో జరిగిన మీడియా సమావేశాల్లో ఇలియాస్‌పై అత్యాచార కేసులు ఉన్నాయంటూ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. అవాస్తవాలతో తన పరువుకు నష్టం కలిగించారని, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఇలియాస్ కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. దీంతో ఈ నెల 20న హాజరుకావాలని కోర్టు నోటీసులు జారీ చేసిందని అన్నారు.

## నవదంపతుల ఆత్మహత్య

కూకట్‌పల్లి-హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): హైదరాబాద్‌లో నవదంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. పెళ్లి చేసుకుని రెండు నెలలు కూడా తిరగకముందే ఆత్మహత్య చేసుకున్నారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈ విషాద సంఘటన జరిగింది. కూకట్‌పల్లిలో ఉంటున్న కార్తీక్, మంజుల గత మార్చి 8వ తేదీన వివాహం చేసుకున్నారు. అయితే ఏమయిందో కానీ భర్త కార్తీక్ ఉరివేసుకోగా, భార్య మంజుల విషం తాగి ఆత్మహత్య చేసుకుంది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



## ఓట్ చోరీ వల్లే ఓడిపోయా: దానం నాగేందర్

ఖైరతాబాద్-హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): ఓటు చోరీ వల్లే తాను సికింద్రాబాద్ లోక్ సభ నియోజకవర్గం నుంచి ఓడిపోయానని, లేదంటే గెలిచేవాడినని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం గత కొద్దికాలంగా 'ఎస్ఐఆర్' (ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) అంటోందని, ఈ ప్రక్రియ తర్వాత ప్రజలు తమ ఓటు ఉందో లేదో చూసుకోవాలని హితవు పలికారు. అటు.. హైడ్రాపై దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో తన వైఖరి మారలేదని స్పష్టం చేశారు. హైడ్రా కారణంగా పేదలకు నష్టం కలగకూడదనే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. పేదల జోలికి వెళ్లకుండా హైడ్రా తన పని తాను చేస్తే స్వాగతిస్తానని అన్నారు. సీసీ కెమెరాలు భద్రత కోసం ఏర్పాటు చేస్తామని, కానీ వాటిని ట్యాపింగ్‌గా అభివర్ణించడం సరికాదని అన్నారు. ఇచ్చిన హామీలను కాస్త ఆలస్యమైనా తప్పకుండా నెరవేరుస్తామని అన్నారు.

### తండ్రిని గౌరవించలేనివారు రాజకీయాలు చేస్తారా?

టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవితపై దానం నాగేందర్ ధ్వజమెత్తారు. కవిత తన తండ్రి కేసీఆర్‌ను ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కవిత తన ఇంటి సమస్యలను రోడ్డు మీదకు తీసుకువస్తూ, తండ్రిని చులకన చేయడం సరికాదని హితవు పలికారు. "సొంత తల్లిదండ్రులను గౌరవించలేని వారు అసలు మనుషులేనా?" అని ప్రశ్నిస్తూ, కవిత కబుర్లు చెప్పడం మానుకొని రాజకీయంగా మాట్లాడాలని సూచించారు. పెద్దాయన కేసీఆర్ ను ఇబ్బంది పెట్టడం కవితకు తగదని అన్నారు. అనవసరమైన విషయాలతో ఆయనను ఇబ్బంది పెడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇక ప్రభుత్వ పాలన గురించి మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని దానం నాగేందర్ స్పష్టం చేశారు. రైతు భరోసా పంపిణీలో కొంత ఆలస్యం జరిగి ఉండవచ్చు కానీ, గతంలో అస్సలు ఇవ్వకపోవడం కంటే ఇప్పుడు ఆలస్యంగానైనా రైతులకు మేలు జరగడం మంచిదే కదా అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రభుత్వం ఎవరినీ వ్యక్తిగతంగా వేధించాలనే ఉద్దేశంతో లేదని, కేవలం ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు.




# పంచాయతీలతోనే వికసిత్ భారత్ సుసాధ్యం

### కేంద్ర పంచాయతీరాజ్ కార్యదర్శి వివేక్ భరద్వాజ్

### 'స్వయంసమృద్ధ పంచాయతీ'పై అవగాహన సదస్సు

హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): 'క్షేత్రస్థాయి పరిపాలనకు పంచాయతీలు పరిణామాత్మక శక్తి. స్వావలంబన, సాధికారత గల పంచాయతీల ద్వారా జాతీయ రూపాంతరీకరణ సాధ్యమవుతుంది' అని కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ ప్రాంగణంలో శనివారం 'స్వయంసమృద్ధ పంచాయతీ కార్యక్రమం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ సహకారంతో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 400 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో స్వీయ వనరుల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడంలో సాధికారత చూపిన 70 మంది పంచాయతీ సర్పంచులు ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేక్ భరద్వాజ్ మాట్లాడుతూ 'స్వయంసమృద్ధ భారత్ -- వికసిత భారత్' లక్ష్యాల సాధనలో స్వయంసమృద్ధ పంచాయతీల పాత్రను వివరించారు. 2047 నాటికి వికసిత భారత్‌ను నిర్మించడంలో సాధికార, స్వయంసమృద్ధ పంచాయతీలు కీలక పాత్ర పోషించాలని, సర్పంచులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ పంచాయతీ రాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ మాట్లాడుతూ, 'ఆర్థికంగా సాధికారత సాధించిన పంచాయతీల ద్వారానే దేశం స్వావలంబన వైపు వేగంగా పయనించగలదు' అని అన్నారు. గ్రాంట్లపై ఆధారపడటం తగ్గించి, స్వీయ వనరులు పెంచుకోవాలని, ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్, తెలంగాణ పంచాయతీ రాజ్ కమిషనర్ డీ దివ్య, నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గోవర్ధన్ సింగ్ రావత్ తదితరులు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. సదస్సులో భాగంగా పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖ సాంకేతిక బృందం 'స్వయంసమృద్ధ పంచాయత్ పోర్టల్'ను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించింది. అప్లికేషన్ వర్క్‌ఫ్లో, డాష్‌బోర్డ్‌లు, డిజిటల్ సాధనాల వినియోగంపై ఆచరణాత్మక అవగాహన కల్పించారు. ఈ సదస్సు గ్రామీణ స్థానిక సంస్థలను ఆర్థికంగా, పరిపాలనాత్మకంగా బలోపేతం చేసి, వికసిత భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ముఖ్యమైన అడుగుగా మారనుంది.

# ధర్మాచరణ కోసమే నారదుడు

### ఇందుకే నారద జయంతి.. వేడుకల్లో వక్తల వెల్లడి



కోఠి-హైదరాబాద్, మే 2 (ఈవార్తలు): మహర్షి నారదుడు ధర్మాచరణ పరాయణుడని, అందరూ అనుకున్నట్టు కలహ భోజనుడు కాదని, నిజానికి ఆయనే మొదటి పాత్రికేయుడని చాలామందికి అవగాహన లేదని, పైగా ఈ మహర్షిని కార్టూన్ల రూపంలో నవ్వులపాలు చేసేందుకు ప్రయత్నించారని హైదరాబాదులో శనివారం జరిగిన నారద జయంతి కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు పేర్కొన్నారు. సమాచారభారతి ఆధ్వర్యంలో కోఠిలోని వైఎంఐఎస్ హాలులో జరిగిన ఈ ఉత్సవంలో మీడియాలోని వివిధ విభాగాలకు చెందిన పలువురు జాతీయవాద జర్నలిస్టులకు పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. పురస్కారాలను అందుకున్నవారిలో 'వార్త' దినపత్రిక సంపాదకులు దామెర్ల సాయిబాబా, సీనియర్ జర్నలిస్ట్ జంధ్యాల శరత్ బాబు, మహిళా జర్నలిస్టు-వీడియో బ్లాగర్ వల్లీ పద్మాంజలి (అంజలి), సీనియర్ కార్టునిస్ట్ సరస్వతుల రామ నరసింహం (సరాసి), ఐన్యూస్ చానెల్ వరంగల్ బ్యూరో చీఫ్ బూరం ప్రశాంత్, రాజ్ టీవీ న్యూస్ చీఫ్ ఎడిటర్ లక్ష్మి ఉన్నారు. వీరికి సమాచార భారతి అధ్యక్షులు ప్రొఫెసర్ జి గోపాల్ రెడ్డి, సంస్థ ఉపాధ్యక్షులైన సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్, జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి చేతుల మీదుగా సత్కారాలు, పురస్కార ప్రదానం జరిగాయి. తొలుత సమాచార భారతి అధ్యక్షులు ప్రొఫెసర్ జి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మీడియా రంగానికి ఈ సంస్థ చేస్తున్న సేవలను వెల్లడించారు. సమాచార భారతి మూడు దశాబ్దాలుగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ మీడియా రంగానికి సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోందని తెలిపారు. వక్రీకరణ జరిగిన భారతదేశ చరిత్రను సరైన దిశలో ప్రపంచానికి తెలియజేయడానికి సమాచార భారతి కృషి చేస్తున్నదని, అందులో భాగంగానే పాత్రికేయ మిత్రులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, సోషల్ మీడియా సంగమాలు, పాత్రికేయ శిక్షణా శిబిరాలు వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. జాతీయవాద పాత్రికేయుల్ని తయారు చేయడం కోసం జర్నలిజం కళాశాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ జర్నలిజం కళాశాలలకు వెళ్లిన సందర్భంలో మొట్టమొదటి పాత్రికేయుడు ఎవరు? అని అడిగినప్పుడు పాశ్చాత్యుల పేర్లు చెప్పేవారు తప్ప నారదుడి గురించి ఎవ్వరూ చెప్పలేదన్నారు. కానీ మనం నారదుని పేరు చెప్పిన తర్వాత ఒప్పుకున్నారన్నారు. మరి ఇన్నాళ్ళూ ఎందుకు నిర్లక్ష్యం చేశారనే ప్రశ్నకు ఎవ్వరి దగ్గర సమాధానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత్రికేయులను సత్కరించేందుకు ప్రతి ఏటా సమాచార భారతి సంస్థ నారద జయంతి జరుపుతున్నదని, ఈ వేడుక ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను మరోసారి మననం చేసుకునే అవకాశం దక్కుతుందన్నారు. అవకాశం చిక్కినప్పుడల్లా నారద మహాముని గురించి పాత్రికేయులు ప్రచారం చేయాలని కోరారు. ముఖ్య అతిథి, జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి మాట్లాడుతూ దేశం అంతరాత్మను మలిచే బాధ్యతను, దేశానికి అవసరమైన అసలైన విషయాలను గుర్తించి సమాజానికి తెలియజేసే బాధ్యతను గుర్తించే రోజు ఈ నారద జయంతి అన్నారు. జర్నలిజం అనేది ఒక ఉత్తమ రూపంగా చేసే ప్రజా సేవ అని కొనియాడారు. ఇది 'ధైర్యానికి', 'సత్యానికి', 'బాధ్యతాయుతమైన జర్నలిజం శక్తికి " జరుగుతున్న ఉత్సవం అన్నారు. తాను సభ్యురాలిగా ఉన్న ఎన్‌హెచ్‌ఆర్సీ ప్రారంభం నుంచీ మీడియా శక్తిని, సేవలను వినియోగించుకుందని తెలిపారు. మానవహక్కుల పరిరక్షణ, ప్రోత్సాహంలో మీడియాని కూడా భాగస్వామిగా భావిస్తున్నదన్నారు. మీడియా ఇచ్చే నివేదికలను ఎన్‌హెచ్‌ఆర్సీ విశ్వసిస్తుందని చెప్పారు. మీడియా కథనాలను సుమోటోగా కూడా స్వీకరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని తెలియజేస్తూ పోలవరం నిర్వాసితులు, సందేశ్ కాలీ సహా పలు సంఘటనలను ఉదహరించారు. అనంతరం అవార్డు గ్రహీతలు తమ స్పందనను తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైన జర్నలిస్టు పసుపుల మన్యంకొండకు నివాళి అర్పించారు.



## వడ్ల లోడుతో వెళ్తున్న లారీ దగ్ధం

### డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

కొడిమ్యాల, మే 2 (ఈవార్తలు): జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి వడ్ల లోడుతో వెళ్తున్న లారీ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతైంది. కొడిమ్యాల మండలం దొంగలమర్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, జగిత్యాల నుండి కరీంనగర్ వైపు వడ్ల లోడుతో ప్రయాణిస్తున్న లారీ దొంగలమర్రి దగ్గరికి చేరుకోగానే డ్రైవర్ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించి లారీ మొత్తం అగ్నికి ఆహుతైంది. మంటలను గమనించిన డ్రైవర్ వెంటనే వాహనం ఆపి బయటకు దూకడంతో ప్రాణాపాయం తప్పినట్లు సమాచారం. సంఘటనను గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో లారీతో పాటు వడ్ల లోడు పూర్తిగా దగ్ధమై భారీ నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం..

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ

సారంగాపూర్, మే 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన యాదరవేణి భూమయ్యకు చెందిన ఇల్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. బాధితులు ఆందోళన చెందవద్దని, తగిన న్యాయం జరిగేలా అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా భూమయ్య కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం ద్వారా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ వహీద్, ఆర్ఐ సంతోష్, స్థానిక సర్పంచ్ అరుణ శేఖర్, మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి, సర్పంచులు కొలపాక రాజు, బాపిరాజు, మేకల శేఖర్, రమేష్, శ్రీనివాస్, పుష్పనాథ్, శంకర్, మాజీ ఉపసర్పంచ్ గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, వల్లపు నాంపల్లి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హనుమాన్ జన్మోత్సవాలకు కొండా సురేఖకు ఆహ్వానం

మల్యాల, మే 2 (ఈవార్తలు): కొండగట్టు అంజన్న క్షేత్రంలో నిర్వహించనున్న హనుమాన్ జన్మోత్సవాలకు(పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు) రావాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ ఈఓఎస్ అంజనారెడ్డి ఆహ్వానించారు. వరంగల్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి.. ఆహ్వాన పత్రికను అందజేశారు. మే 10 నుంచి 12 వరకు జన్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానాచారి కపిందర్, వేదపండితులు తేజాశర్మ, సూపరింటెండెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# కల్లు దుకాణాల్లో పిల్లలు

### తండ్రితో కలిసి చిన్నారి సేవనం.. జగిత్యాల కల్లు షాపులో ఘటన



జగిత్యాల, మే 2 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో కల్లు బైరక్ షాపుల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ కల్లుషాప్‌లో నాలుగేళ్ల చిన్నారి తన తండ్రితో కలిసి వచ్చి కల్లుతాగుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటన స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. మైనర్లకు మద్యం విక్రయం నిషేధమనే నిబంధనలు ఉన్నప్పటికీ, అవి పూర్తిగా ఉల్లంఘన అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంత చిన్నారి మద్యం సేవిస్తున్నా, అక్కడి షాప్ యజమానులు చూసి చూడనట్లు వ్యవహరించడం మరింత ఆగ్రహానికి దారితీస్తోంది. షాప్ యజమానుల నిర్లక్ష్యం మాత్రమే కాకుండా, ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ లోపం కూడా స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. "మామూలు మత్తు"లో అధికారులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తూ, పరిస్థితిని పట్టించుకోవడంలో విఫలమయ్యారని అంటున్నారు. ఇక కొన్ని షాపుల్లో కల్లులో మత్తు పెంచేందుకు గుల్బారామ్ వంటి పదార్థాలు కలుపుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలు ప్రజల ఆరోగ్యానికే కాకుండా, ముఖ్యంగా చిన్నారుల భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి. ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన షాప్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే మైనర్లకు మద్యం అందకుండా కఠిన పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## డీసీపీవో హరీశ్ డిస్మిస్

### మహిళా ఉద్యోగిపై అనుచిత ప్రవర్తన

### లైంగిక వేధింపుల ఆరోపణలు నిజం



జగిత్యాల, మే 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బాల సంరక్షణ అధికారిగా (డీసీపీవో) పనిచేస్తున్న ఎం హరీశ్‌ను ఉద్యోగం నుండి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. మహిళా ఉద్యోగిపై అనుచిత ప్రవర్తన, లైంగిక వేధింపులు, అధికార దుర్వినియోగం, హాజరు రికార్డుల్లో మార్పులు, కార్యాలయ నియమావళి ఉల్లంఘనలపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారం రాష్ట్ర మహిళా కమిషన్ దృష్టికి వెళ్లగా, జిల్లా లైంగిక వేధింపుల నిరోధక కమిటీ విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక సమర్పించింది. ఉద్యోగులపై లైంగిక వేధింపులు, మహిళా ఉద్యోగులపై అనుచిత ప్రవర్తన, హాజరు రికార్డుల్లో మార్పులు, అధికార దుర్వినియోగం, ఉన్నతాధికారులను చూపిస్తూ సిబ్బందిపై ఒత్తిడి తేవడం వంటి ఆరోపణలు విచారణలో వెలుగులోకి వచ్చాయి.

ఇప్పటికే కమిటీ హరీష్‌ను హెచ్చరించి ప్రవర్తన మార్చుకోవాలని సూచించినప్పటికీ, ఆయన వాటిని పట్టించుకోకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తూ తిరిగి అదే చర్యలకు పాల్పడ్డారు. దీంతో కమిటీ మరోసారి షోకాజ్ నోటీస్ జారీ చేసింది. అయితే ఆ నోటీసుకు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో హరీష్‌ను ఉద్యోగం నుంచి టెర్మినేట్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

అలాగే ఆయన వద్ద ఉన్న ప్రభుత్వ రికార్డులు, ఆస్తులను వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది.



## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సంజయ్ ఆర్థిక సాయం

జగిత్యాల, మే 2 (ఈవార్తలు): జగిత్యాల మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన పెంట లక్ష్మీ ఇటీవల ప్రమాదవశాత్తూ కరెంటు షాక్‌తో మృతి చెందగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో రూ.50 వేల చెక్కుతో పాటు రూ.4 లక్షల 50 వేల విలువైన బాండ్‌ను బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏడీఈ జవహర్ నాయక్, సర్పంచులు ప్రకాష్, బొడ్డు దామోదర్, మాజీ ఎంపిటిసి శంకర్, నాయకులు బందేల శేఖర్, లక్ష్మీ రాజం, మాజీ సర్పంచ్ అంకం సతీష్, కోల శ్రీనివాస్, రవీందర్ రావు, సురేందర్ నాయక్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై మంచి మనసు

ధర్మపురి, మే 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన కారు ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అటుగా వెళ్తున్న వెల్గటూర్ ఎస్ఐ ఉదయ్ కుమార్ స్పందించి గాయపడిన వ్యక్తిని తన వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించారు.

## జగిత్యాల ఎంసీగా సత్య ప్రణవ్ బాధ్యతలు

### ఎమ్మెల్యే సంజయ్‌తో మర్యాదపూర్వక భేటీ

జగిత్యాల, మే 2 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా సత్య ప్రణవ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. జగిత్యాల మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు కమిషనర్ సత్య ప్రణవ్ తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కమిషనర్‌కు అభినందనలు తెలియజేస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.



## గ్యాస్ ధరలతో సామాన్యుడి జేబుకు చిల్లు: వసంత

జగిత్యాల, మే 2 (ఈవార్తలు): వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.993 పెంచడం అన్యాయమని జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. శనివారం ఆమె మాట్లాడుతూ 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై భారీగా ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒక్క సిలిండర్ ధర రూ.3314కు చేరిందని తెలిపారు. ఈ 2026 సంవత్సరంలోనే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను ఆరు సార్లు పెంచినట్టు ఆమె పేర్కొన్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు నష్టపోతూ మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. వాటిపై ఆధారపడి జీవించే అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక దినోత్సవం రోజునే సిలిండర్ ధరలు పెంచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాన్ని మోపిందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

## ప్రతి హామీ నెరవేరుస్తాం: అడ్లూరి

జగిత్యాల, మే 2 (ఈవార్తలు): రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వ లక్ష్యం సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన "99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం ధర్మపురిలోని శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు మేనిఫెస్టోలో లేని పథకాలను కూడా అమలు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, రానున్న గోదావరి పుష్కరాల కోసం సుమారు రూ.450 కోట్ల అంచనాలతో ఘాట్లు, మౌలిక సదుపాయాల ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. ఇందులో తొలి విడతగా టైర్-1 ద్వారా రూ.115 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. విద్యారంగంలో భాగంగా రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ధర్మపురికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇళ్ల పథకం కింద నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 3,104 మందికి ఇళ్లు మంజూరు చేసి రూ.139 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఇరాన్‌కు 5 బిలియన్ డాలర్ల నష్టం

**గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా దిగ్బంధనం ఎఫెక్ట్**

పెంటగాన్: గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా నేతృత్వంలో కొనసాగుతున్న కఠినమైన దిగ్బంధనం కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఈ ఆంక్షల వల్ల ఇరాన్ చమురు అమ్మకాల ద్వారా పొందాల్సిన దాదాపు 5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోయిందని అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) అంచనా వేసింది. ఇస్లామాబాద్‌లో జరిగిన శాంతి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఇరాన్‌ను మళ్లీ చర్చల వేదికకు తీసుకురావడానికి ఈ ఆర్థిక దిగ్బంధనాన్ని తమ ప్రధాన అస్త్రంగా అమెరికా ఉపయోగిస్తోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో ఏప్రిల్ 13న ఈ దిగ్బంధనం ప్రారంభమైంది. అప్పటి నుంచి చమురు లేదా ఇతర నిషేధిత వస్తువులను రవాణా చేస్తున్నాయనే అనుమానంతో 40కి పైగా నౌకలను దారి మళ్లించినట్లు పెంటగాన్ అధికారులు తెలిపారు. యాక్సియోస్ కథనం ప్రకారం ఈ ఆపరేషన్‌లో భాగంగా రెండు నౌకలను అమెరికా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం గల్ఫ్ జలాల్లో సుమారు 53 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురుతో ఉన్న 31 ఇరానియన్ ట్యాంకర్లు



చిక్కుకుపోయాయని అధికారులు వెల్లడించారు. దీని విలువ దాదాపు 4.8 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా. ఇప్పటికే భూమిపై ఉన్న నిల్వ కేంద్రాలు నిండిపోవడంతో ఇరాన్ పాతబడిన ట్యాంకర్లను తేలియాడే నిల్వ కేంద్రాలుగా (ఫ్లోటింగ్ స్టోరేజ్ యూనిట్లుగా) మార్చింది. అమెరికా నిఘాను తప్పించుకోవడానికి కొన్ని నౌకలు చైనాకు చేరడానికి సుదీర్ఘమైన, ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. ట్యాంకర్‌ట్రాకర్స్.కామ్ సహ వ్యవస్థాపకుడు సమీర్ మదానీ ఈ పరిస్థితిని విశ్లేషించారు. "హ్యాజ్" అనే పేరున్న ఒక ట్యాంకర్ పాకిస్థాన్, భారత తీరాలకు దగ్గరగా ప్రయాణించి, అనంతరం మలక్కా జలసంధి వైపు వెళ్లిందని, అక్కడి నుంచి చమురును చైనాకు వెళ్లే ఇతర నౌకలకు తరలిస్తున్నారని ఆయన తెలిపారు. "ఒత్తిడి ఇలాగే కొనసాగితే, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో భారీగా నిల్వలను ఏర్పాటు చేసుకుని, ఏదో ఒకరోజు రాత్రికి రాత్రే ఒక్కసారిగా తప్పించుకోవడానికి (గ్రేట్ ఎస్కేప్) ఇరాన్ ప్రయత్నించవచ్చని నేను భావిస్తున్నాను" అని ఆయన యాక్సియోస్‌తో అన్నారు. ఈ ప్రతిష్టంభన ఇరు దేశాల మధ్య భారీ ఆర్థిక ఘర్షణగా మారింది. హర్మూజ్ జలసంధిలో ఇరాన్ రాకపోకలను నియంత్రిస్తుంటే, అమెరికా దిగ్బంధనంతో ప్రతిఘటిస్తోంది. మరికొన్ని వారాల్లో ఇరాన్ వద్ద నిల్వ సామర్థ్యం పూర్తిగా అయిపోయి, చమురు ఉత్పత్తిని నిలిపివేయాల్సిన ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. "నిల్వ సామర్థ్యం పూర్తిగా అయిపోవడానికి వారికి కొన్ని వారాలు, లేదా బహుశా ఒక నెల సమయం పట్టవచ్చు" అని యూరేషియా గ్రూప్‌కు చెందిన విశ్లేషకుడు గ్రెగరీ బ్రూ పేర్కొన్నారు. "ఉగ్రవాదానికి, ప్రాంతీయ అస్థిరతకు నిధులు సమకూర్చే ఇరాన్ ప్రభుత్వ సామర్థ్యంపై మేము విధ్వంసకరమైన దెబ్బ కొడుతున్నాం. ఈ ప్రాంతంలోని మా సాయుధ దళాలు ఈ నిరంతర ఒత్తిడిని కొనసాగిస్తాయి" అని పెంటగాన్ తాత్కాలిక ప్రెస్ సెక్రటరీ జోయెల్ వాల్డెజ్ స్పష్టం చేశారు.

# బెంగాల్‌లో ప్రశాంతంగా రీపోలింగ్

## భారీగా ఓటింగ్ నమోదు.. 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్

### తుది పోలింగ్ శాతం 90కి పైగా 4న ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాలు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి ఉద్రిక్తతలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తయింది. కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ ప్రక్రియ జరిగింది. సాయంత్రం 5 గంటల సమయానికి 15 బూత్‌లలో కలిపి సగటున 86.90 శాతం ఓటింగ్ నమోదైంది. మగ్రాహత్ (పశ్చిమ) నియోజకవర్గంలోని 11 బూత్‌లలో 86.11 శాతం, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 బూత్‌లలో 87.60 శాతం పోలింగ్ నమోదైనట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం వెల్లడించింది. తుది గణాంకాలు తేలిన తర్వాత పోలింగ్ శాతం 90కి పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రీపోలింగ్‌లో ఇది చాలా అధికమని వారు పేర్కొన్నారు. ఈసారి రెండు దశల్లో (ఏప్రిల్ 23, 29) జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 93 శాతం పోలింగ్ నమోదై స్వాతంత్ర్యం తర్వాత కొత్త రికార్డు సృష్టించింది. మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుండగా, అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. ఎగ్జిట్ పోల్స్ చాలా వరకు... 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలికి, బీజేపీ అధికారంలోకి వస్తుందని అంచనా వేసిన విషయం తెలిసిందే.

## ఉడుత బీభత్సం.. 18 మందికి గాయాలు

**ఉదయ్‌పూర్ యూనివర్సిటీలో ఘటన**

ఉదయ్‌పూర్: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉన్న మోహన్‌లాల్ సుఖాడియా యూనివర్సిటీలో ఓ ఉడుత బీభత్సం సృష్టిస్తోంది. నెల రోజులుగా క్యాంపస్‌లోని విద్యార్థులు, సిబ్బందిపై వరుసగా దాడులు చేస్తూ 18 మందికి పైగా గాయపరిచింది. దీంతో యూనివర్సిటీలో భయాందోళనలు నెలకున్నాయి. విద్యార్థులు క్యాంపస్‌లో తిరగాలంటేనే జంకుతున్నారు. యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ క్యాంపస్, ముఖ్యంగా సైకాలజీ, ఉమెన్స్ స్టడీస్ విభాగాల సమీపంలో ఈ దాడులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఏప్రిల్ 22న ఇద్దరు రీసెర్చ్ స్కాలర్లపై కూడా ఈ ఉడుత దాడి చేయడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. కర్టెన్ల వెనుక దాక్కొని, అకస్మాత్తుగా మీదకు దూకి దాడి చేస్తుండటంతో దీని బారి నుంచి తప్పించుకోవడం కష్టంగా మారిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉడుత భయంతో కొందరు విద్యార్థులు క్యాంపస్‌కు రావడం కూడా మానేశారు. ఈ విషయంపై ఆర్ట్స్ కాలేజీ అసోసియేట్ డీన్ నవీన్ నంద్వానా మాట్లాడుతూ.. ఉడుతను సురక్షితంగా పట్టుకునేందుకు యానిమల్ ఎయిడ్ బృందం ప్రయత్నించి విఫలమైందని తెలిపారు. దీంతో ఇప్పుడు వన్యప్రాణి నిపుణుల సహాయం తీసుకోవాలని నిర్ణయించామని, వారి ఆధ్వర్యంలో ఉడుతను పట్టుకుని సురక్షితమైన అటవీ ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు.

## నేడే నీట్-యూజీ పరీక్ష

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆదివారం జరగనున్న నీట్-యూజీ పరీక్షకు ఎన్టీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. నీట్ పరీక్ష నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్ అమలులో ఉంటుంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ఒక పబ్లిక్ నోటీసు విడుదల చేశారు. ఈ నోటీసు ప్రకారం, పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకన్నా ఎక్కుమంది గుమికూడటం నిషిద్ధం. పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలి. పరీక్ష సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కోరారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు సుమారు 22.79 లక్షలమందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పరీక్ష కోసం విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్ష కేంద్రం మూసివేస్తారు. ఆదివారం కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నందున విద్యార్థులు అందుకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని ఎన్టీఏ ఒక అడ్వైజరీ జారీ చేసింది. అడ్మిట్ కార్డు, ఫొటో గ్రాప్ తడిచిపోకుండా ట్రాన్స్‌పరెంట్ పౌచ్‌లు ఉపయోగించాలని సూచించింది.

## పశ్చిమాసియా, యూరప్ ముక్కలయ్యేవి: ట్రంప్

వాషింగ్టన్: తమతో యుద్ధం తర్వాత ఇరాన్ నాయకత్వం బలహీనపడిందని, ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఫ్లోరిడాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇరాన్‌పై దాడి చేసి ఆ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా అడ్డుకున్నామని తెలిపారు. ఒకవేళ తాను అలా చేయకపోయి ఉంటే పశ్చిమాసియా, యూరప్ దేశాలు ముక్కలైపోయేవని అన్నారు. ఇరాన్ అనే అందమైన దేశంలోకి వెళ్లి వారి వద్ద అణ్వాయుధాలు లేవని మనం నిర్ధారించుకోవాలని వ్యాఖ్యానించారు. బీ2 బాంబర్లతో వారిని అడ్డుకున్నట్లు చెప్పారు. అమెరికా అలా చేయకపోయి ఉంటే వారి వద్ద అణ్వాయుధాలు ఉండేవని, అప్పుడు ఇజ్రాయెల్, పశ్చిమాసియాతో సహా యూరప్ దేశాలు ముక్కలుగా పేలిపోయి ఉండేవని వ్యాఖ్యానించారు. తమ సైనిక చర్యతో ఇరాన్ నాశనమైందని అన్నారు. వారి వైమానిక, నౌకాదళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు. శాంతిచర్చలు తాను ఆశించినవిధంగా జరగడం లేదని అన్నారు. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయని, యుద్ధం ఆగిపోతే తగ్గుతాయని పేర్కొన్నారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలనుకుంటోందని కానీ వారి ప్రతిపాదన సంతృప్తికరంగా లేదని అన్నారు. ఇరాన్‌లో నాయకత్వం విచ్ఛిన్నం అయిందని, అక్కడ నాలుగైదు గ్రూపులు ఉన్నాయని, అందుకే ఒప్పందం విషయంలో గందరగోళం నెలకొందని అన్నారు.

## 180 సీట్లు గెలుస్తాం: టీవీకే

చెన్నై: తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో, విజయ్ నేతృత్వంలోని తమ పార్టీ 234 స్థానాలకు గాను 180 నుంచి 200 నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎగ్జిక్యూటివ్ చీఫ్ కోఆర్డినేటర్ కేఏ సెంగొట్టయాన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా మెజారిటీ సాధించదనే పరిస్థితి ఉండదని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన స్థానాలు తాము తప్పకుండా గెలుస్తామని, విజయ్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. తమ నాయకుడు విజయ్ దూరదృష్టితో పాలన అందిస్తారని పేర్కొన్నారు. 2026 ఎన్నికల విజయం తమకు చారిత్రాత్మకమైనదని అన్నారు. విజయ్ రాత్రనగ, పగలనక కష్టపడ్డారని, ఎన్నో పరీక్షలను ఎదుర్కొన్నారని, మే 4న వచ్చే ఫలితమే సమాధానం చెబుతుందని అన్నారు. ఎన్నికల అనంతరం పొత్తు వార్తలను ఆయన కొట్టిపారేశారు. తమకు స్పష్టమైన మెజారిటీ వస్తుందని తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్ సర్వేలు తెలిపాయి. అయితే విజయ్ ఈ ఫలితాల అనంతరం కింగ్ మేకర్‌గా నిలుస్తారని టుడేస్ చాణక్య, యాక్సిస్ మై ఇండియా అంచనా వేశాయి. అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చే అవకాశం లేదని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. ఈ నేపథ్యంలో, సెంగొట్టయన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.




## మేం యుద్ధాన్ని కోరుకోవడం లేదు: ఇరాన్

న్యూఢిల్లీ: అమెరికాతో యుద్ధాన్ని ఇరాన్ కోరుకోవడం లేదని, ఈ ఘర్షణను నివారించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశామని, వారు నిరంతరం దాడులు చేయడంతో తాము ప్రతిస్పందించాల్సి వచ్చిందని భారత్‌లో ఇరాన్ రాయబారి అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ పేర్కొన్నారు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రపంచ దేశాలు ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధం లేని, శాంతి లేని పరిస్థితి నెలకొందని అన్నారు. సాధారణ పరిస్థితి నెలకొనాలా, వద్దా అనే విషయం ఈ యుద్ధం ప్రారంభించిన వారి చేతిలోనే ఉందని స్పష్టం చేశారు. ఇరాన్ మాత్రం యుద్ధాన్ని కోరుకోవడం లేదని అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ నిరంతరం దాడులు చేయడంతో తాము ప్రతిస్పందించాల్సి వచ్చిందని అన్నారు. దాడులు చేసే అధికారం వాళ్లకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. చర్చల సమయంలోనే సుప్రీం లీడర్ సహా అనేకమంది మరణానికి వారు కారణమయ్యారని మండిపడ్డారు. చిన్నారులు, సామాన్యులను ఎంతో మందిని చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం వల్ల నాలుగు వేలమంది చనిపోగా, 40 వేల ఇరాన్ పౌరులు గాయపడినట్లు చెప్పారు. తమ దేశంలో ఎన్నో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని అన్నారు. తాము బేషరతుగా లొంగిపోవాలని వారు చెబుతున్నారని, దానిని అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ఈ యుద్ధం వల్ల ప్రపంచదేశాలు ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చివేయాలనే వారి లక్ష్యం నెరవేరదని వ్యాఖ్యానించారు.

## సముద్ర గర్భంలో త్రివర్ణ పతాకం రెపరెపలు

పోర్ట్‌బ్లెయిర్: భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. అండమాన్ నికోబార్ దీవుల్లోని ప్రఖ్యాత రాధానగర్ బీచ్‌లో సముద్ర గర్భంలో అతిపెద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ అద్భుత ఘట్టం దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ చారిత్రాత్మక ఫీట్‌ను 223 మందితో కూడిన డైవర్ల బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ బృందంలో భారత నౌకాదళం, పోలీసు సిబ్బందితో పాటు ఇతర



ఏజెన్సీలకు చెందిన నిపుణులు కూడా పాలుపంచుకున్నారు. అత్యంత సమన్వయంతో వీరంతా కలిసి నీటి అడుగున త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో, సముద్రంలో ఆవిష్కరించిన అతిపెద్ద జాతీయ జెండాగా ఇది గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో అధికారికంగా నమోదైంది. ఈ ఘనతతో అండమాన్ నికోబార్ దీవుల పేరు మరోసారి ప్రపంచ యవనికపై నిలిచింది. ఈ అపురూప దృశ్యం దేశ ప్రజల్లో స్ఫూర్తిని నింపింది.

## ప్రసార భారతి చైర్మన్‌గా ప్రసూన్ జోషి

న్యూఢిల్లీ: బాలీవుడ్ లిరిక్ రైటర్, కమ్యూనికేషన్ నిపుణుడు ప్రసూన్ జోషి ప్రసార భారతి కొత్త చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. సాహిత్యం, ప్రకటనలు, సినిమా రంగాల్లో విశేష అనుభవం ఉన్న ప్రసూన్ జోషి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ప్రసూన్ జోషి నియామకంపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హర్షం వ్యక్తం చేశారు. "ప్రసూన్ జోషికి హృదయపూర్వక అభినందనలు. ఆయన ఒక అరుదైన సృజనశీలి. ఆయన మాటల్లో భారతీయత ఉట్టిపడుతుంది. ఆయన నాయకత్వంలో ప్రసార భారతి కొత్త ఉత్తేజంతో, లోతైన లక్ష్యంతో ముందుకు సాగుతుంది" అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నియామకానికి ముందు, ప్రసూన్ జోషి 2017 ఆగస్టు నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్ సీ) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో మెక్‌కాన్ వరల్డ్ గ్రూప్ ఇండియా సీఈఓగా, మెక్‌కాన్ ఆసియా పసిఫిక్ చైర్మన్‌గా కూడా ఆయన పనిచేశారు. ప్రసూన్ జోషి తన కలంతో ఎన్నో అద్భుతమైన పాటలకు ప్రాణం పోశారు. 'రంగ్ దే బసంతి' చిత్రంలోని 'లూకా చుపీ', 'రూబరూ', 'మస్తీ కీ పాఠశాల' వంటి సూపర్ హిట్ గీతాలతో పాటు, 'తారే జమీన్ పర్'లోని 'మా', 'బమ్ బమ్ బోలే' వంటి భావోద్వేగభరితమైన పాటలను ఆయన రచించారు. అలాగే 'ఢిల్లీ-6'లోని 'మసకలి', 'భాగ్ మిల్కా భాగ్'లోని 'జిందా', 'ఓ రంగ్రేజ్', 'ఫనా'లోని 'చాంద్ సిఫారిష్', 'హమ్ తుమ్' టైటిల్ సాంగ్, 'గజిని'లోని 'గుజారిష్', 'నీర్జా', 'మణికర్ణిక' వంటి అనేక చిత్రాలకు ఆయన అందించిన సాహిత్యం ఎంతో ప్రాచుర్యం పొందింది. కాగా, 1990 ప్రత్యేక చట్టం ప్రకారం ఏర్పాటైన ప్రసార భారతి సంస్థ, 1997 నుంచి భారతదేశంలో ప్రభుత్వ రంగ ప్రసార సేవలను అందిస్తున్న స్వయంప్రతిపత్తి గల సంస్థగా పనిచేస్తోంది.

## స్టాక్ మార్కెట్ల కోసమే ఎగ్జిట్ పోల్స్: మమత బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధిస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ స్పందించారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఆమె తోసిపుచ్చారు. కౌంటింగ్ ఏజెంట్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ, టీఎంసీ తప్పకుండా ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని, 2021, 2024లోనూ అలాగే చేశాయని అన్నారు. స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేయడానికే ఎగ్జిట్ పోల్స్ తప్పుడు ప్రచారాలని ఆరోపించారు. ఇప్పుడు కూడా అదే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. టీఎంసీ కార్యకర్తలపై కేంద్ర బలగాలు దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక వారి సంగతి చూస్తామని హెచ్చరించారు.

## రేట్లు పెరగనున్న సబ్బులు, షాంపూలు

**పెరగనున్న హిందూస్థాన్ యూనీ లివర్ ధరలు**

న్యూఢిల్లీ: నిత్యం మనం వాడే సబ్బులు, షాంపూలు, డిటర్జెంట్ల ధరలు ఇకపై మరింత ప్రియం కానున్నాయి. ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ హిందూస్థాన్ యూనీలీవర్, తన ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించి వినియోగదారులకు షాక్ ఇచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు నేరుగా సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టబోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఈ పెంపునకు మూలకారణంగా కనిపిస్తున్నాయి. యుద్ధ మేఘాల వల్ల ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. దీనివల్ల రవాణా ఖర్చులు పెరగడమే కాకుండా, ప్యాకేజింగ్ కోసం వాడే ప్లాస్టిక్, సబ్బులు తదితర అన్ని వస్తువుల తయారీకి అవసరమైన ముడిసరుకుల వ్యయం 8 నుంచి 10 శాతం పెరిగింది. పెరిగిన ఉత్పత్తి వ్యయాన్ని తట్టుకుని, కంపెనీ లాభాలను కాపాడుకోవడానికి ధరల సర్దుబాటు తప్పనిసరి అయిందని సీఈఓ ప్రియా నాయర్, సీఎఫ్ఓ నిరంజన్ గుప్తా స్పష్టం చేశారు. మనం రోజూ వాడే అనేక బ్రాండ్ల ధరలు ఇప్పటికే 2 నుంచి 5 శాతం పెరిగాయి. మరికొన్ని ఉత్పత్తుల విషయంలో ధర పెంచకుండా, ప్యాకెట్ పరిమాణాన్ని తగ్గించే వ్యూహాన్ని కూడా కంపెనీ అమలు చేస్తోంది. సాధారణంగా హిందుస్థాన్ యూనీలీవర్ వంటి పెద్ద సంస్థ ధరలు పెంచితే, దానిని అనుసరిస్తూ మిగిలిన పోటీ సంస్థలు కూడా రేట్లు పెంచే అవకాశం ఉంటుంది. ఇది మొత్తం ఎఫ్ఎంసీజీ రంగంలో ధరల పెరుగుదలకు దారితీసి, ద్రవ్యోల్బణం పెరగడానికి కారణమవుతుంది.

# ప్రజలు ఎండ తీవ్రత నుండి జాగ్రత్తలు పాటించాలి

### నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట, మే 2:** నారాయణపేట: జిల్లా ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఎండల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఇటీవల అధిక ఎండల కారణంగా ఒక ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతి అయిన సంఘటనను ప్రస్తావిస్తూ, వాహనాలను నేరుగా ఎండలో పార్క్ చేయకుండా చెట్ల నీడలో లేదా షెడ్లలో ఉంచాలని సూచించారు. వాహనాల్లో ఇంధనం, బ్యాటరీలు వంటి భాగాలు అధిక వేడికి గురై ప్రమాదాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. ప్రజలు ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం, చల్లని నీరు తరచుగా తాగడం, ఎలక్ట్రోలైట్ పానీయాలు సేవించడం ద్వారా డీహైడ్రేషన్ నుంచి రక్షించుకోవాలని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండల వల్ల అలసట, తలనొప్పి, తల తిరగడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. ఎండల్లో ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించే పోలీసులు, చెక్‌పోస్టలలో విధులు నిర్వర్తించే సిబ్బంది మరియు ఇతర ఫీల్డ్ డ్యూటీలో ఉన్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. వీరు తరచుగా నీరు తాగుతూ, అవసరమైతే నీడలో విశ్రాంతి తీసుకుంటూ, తలకు క్యాప్ లు, గుడ్డలు ఉపయోగించడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో, చెత్త గుట్టల వద్ద అజాగ్రత్తగా మంటలు వేయకుండా ఉండాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# పోలీస్ పరేడ్ క్రమశిక్షణకు, ఆరోగ్యానికి ప్రతీక

### వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా





**వికారాబాద్, మే 2:** జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో ఈరోజు నిర్వహించిన జనరల్ పరేడ్‌లో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) స్నేహ మెహ్రా, ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించి, పరేడ్ ను అత్యంత నిశితంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ.. నిరంతరం విధి నిర్వహణలో ఒత్తిడికి లోనయ్యే పోలీస్ సిబ్బందికి పరేడ్ అనేది కేవలం ఒక కసరత్తు మాత్రమే కాదని, అది శారీరక దృఢత్వానికి మరియు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి వారం క్రమం తప్పకుండా పరేడ్‌లో పాల్గొనడం వల్ల వృత్తిపరమైన క్రమశిక్షణ అలవడుతుందని, ఇది విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు తోడ్పడుతుందని ఆమె వివరించారు. అదేవిధంగా, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, యోగా, వ్యాయామం, సమతుల ఆహారం వంటి అంశాలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. శారీరకంగా దృఢంగా, మానసికంగా ఉల్లాసంగా ఉన్న పోలీస్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని ఆమె తెలిపారు. పరేడ్ అనంతరం ఎస్పీ సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎదుర్కొంటున్న వ్యక్తిగత మరియు వృత్తిపరమైన ఇబ్బందుల గురించి ఆరా తీశారు. సిబ్బంది సంక్షేమమే తమ ప్రాధాన్యత అని పేర్కొంటూ, పోలీస్ అధికారులందరూ సిబ్బందికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, ఏఆర్ డిఎస్పి వీరేష్, ఆర్.ఐలు నాగరాజు,శ్రీశైలం లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తుకు గుడ్‌బై చెబుదాం







**నారాయణపేట, మే 2:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, నారాయణపేట జిల్లాలో శనివారం డ్రగ్ అవేర్‌నెస్ ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆర్‌డీఓ కార్యాలయం నుండి సావర్కర్ చౌరస్తా వరకు నిర్వహించబడింది. ఈ ర్యాలీ లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ యువత, విద్యార్థులు మరియు సాధారణ ప్రజల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. "ఘ్రఎ చీశ్ శీ ణతీబస్త్రం" అనే సందేశంతో పాల్గొన్నవారు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో గౌరవనీయ జిల్లా సంక్షేమ అధికారి (ఐబొ) ఎల్. రాజేందర్ గౌడ్ , క్షేత్రస్థాయి అధికారి సాయిగారు, డీడబ్ల్యుఓ విభాగంలోని అన్ని విభాగాల సిబ్బంది, వైద్య శాఖకు చెందిన ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. మాదకద్రవ్యాల నివారణ, ముందస్తు గుర్తింపు మరియు కౌన్సెలింగ్ సేవల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో డ్రగ్ వ్యసనంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు అవగాహన

### వికారాబాద్ సహాయ కార్మిక అధికారి ఎం.యాదయ్య

**వికారాబాద్, మే 2:** మే డే వేడుకలలో భాగంగా భవన నిర్మాణ కార్మికుల రిజిస్ట్రేషన్‌పై మదుల్ చిట్టంపల్లి, వికారాబాద్ నందు అవగహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ అవగహన కార్యక్రమంలో భాగంగా ఎం. యాదయ్య సహాయ కార్మిక అధికారి, వికారాబాద్, మాట్లాడుతూ ప్రతి భవన నిర్మాణ కార్మికుడు 110/- రూపాయలు చెల్లించి భవన నిర్మాణ సంక్షేమ మండలిలో నమోదు చేసుకోవాలని చెప్పడం జరిగింది. చేసుకున్నా కార్మికులకు ఐదు సంవత్సరాల వరకు ఈ కార్డు కాల పరిమితి ఉంటుంది. కార్డు వున్నా ప్రతి కార్మికుడికి ప్రమాద బీమ్ కింద 10,00,000/- రూపాయలు మరియు సహజ మరణం క్రింద 2,00,000/-రూపాయలు, ప్రసూతి సహాయం మరియు వివాహ కానుక క్రింద 30,000/- రూపాయలు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. కార్డు వున్నా ప్రతి కార్మికుడు, ప్రతి ఐదు సంవసరాలకి ఒక సారి 60/- కట్టి మీసేవ ద్వారా రెన్యువల్ చూసుకోవాలని చెప్పడం జరిగింది. తదుపరి మాట్లాడుతూ లబ్ది దారులకు నేరుగా వారి బ్యాంకు అకౌంట్ లో కి డబ్బులు రావడం జరుగుతుంది. కాబట్టి మధ్య వర్తులని ఆశ్రహించవద్దని కోరడం జరిగింది. ఈ కారిక్రమం లో సి.స్.స్. జిల్లా కోఆర్డినేటర్ మరియు ఎన్. జి.ఓ. వారు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలు



**గజ్వేల్ మే 2:** గజ్వేల్ మండలంలోనీ అక్కారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శని వారం రోజు శాసనసభ పక్ష ఉపనేత మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. వారినీ బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువాలు వేసి శుభాకాంక్షలు తెలిపిన తన్నీరు హరీష్ రావు కాంగ్రెస్ పార్టీనుండి బిఆర్ఎస్ పార్టీ చేరినవారు బుడుగు ఎల్లం (సింగర్), మాదరబోయిన శేఖర్, మంద రవి, బత్తిని భాను, గుండబోయిన రాజు, దామరకుంట మహేందర్, రాహుల్, విజయ్ తో పాటు తదితరులు చేరారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మ బాయి నర్సింగరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,కౌన్సిలర్లు గోలి మమత సంతోష్, అత్తిలి శ్రీనివాస్ , మన్నేరూపా వెంకటేష్,కనక సేన, కప్ప పోచయ్య,మాజీ కౌన్సిలర్లు గుంటుకు రాజు, మరికంటి కనకయ్య అక్కారం మాజీ సర్పంచ్ బాలచందర్ తదితరున్నారు

# రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహణ

■ **వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, మే 2:** ప్రజా సమస్యల పరిష్కారం కొరకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో నోడల్ అధికారిగా రాజస్వ మండల అధికారిని నియమించి ప్రజావాణి కార్యక్రమ నిర్వహ ణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు స్వీకరించిన 30 రోజులలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని , లేనిపక్షంలో తిరస్కరణ, అందుకు గల కారణాలతో దరఖాసుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సంబంధిత వివరాలను పోర్టల్ లో నమోదు చేసి రసీదు అందించాలని, దరఖాస్తుదారులు ప్రజావాణి పోర్టల్ లో తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి వచ్చే ప్రజలకు త్రాగునీరు, కుర్చీలు, అత్యవసర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. సోమవారము నుండి డివిజన్ స్థాయిలో ప్రజా వాణి కార్యక్రమము నిర్వహించడం జరుగుతుందని , డివిజన్ స్థాయి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# చెరువు మట్టి రవాణాపై నియంత్రణ



**పెద్దపల్లి, మే 02( సమయం న్యూస్) :** జిల్లాలో చెరువుల నుంచి మట్టి (గ్రావెల్) రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ప్రారంభ దశలో కొడురుపాక, రాయకుంట, ముత్తారం చెరువులకు మాత్రమే అనుమతులు ఇస్తామని చెప్పారు. ప్రతి వాహనానికి ఫోటో, రసీదు తప్పనిసరి కాగా, అధిక లోడుతో రవాణా నిషేధించారు. అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మానేరువాగు పరిధిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

# పారదర్శకంగా పథకాల అమలు

■ **నిర్మల్ జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే**



**ఖానాపూర్ మే 2 :** ఖానాపూర్ లో నిర్వహించిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లా డుతూ, ప్రభుత్వ పథకాల ఫలాలు ప్రజలకు మెరుగ్గా అంది ంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుధ్యం, విద్య, వైద్యం తదితర కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, రాబోయే రోజుల్లో రైతు వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఖానాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు, సబ్సిడీ విద్యుత్, రేషన్ కార్డులు, రైతు భరోసా వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులను సన్మానించగా, మహిళా సంఘాలకు చెక్కులు, దివ్యాంగులకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టు ను పూర్తిచేస్తాం

■ మంత్రి పొన్నం ప్రభాకర్





**సిద్దిపేట, మే 2 :** హుస్నాబాద్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాల్లో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రైతులకు భరోసా, బీమా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఉచిత విద్యుత్, పింఛన్లు, రేషన్ బియ్యం వంటి పథకాలు విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు .రోడ్లు, విద్యా, వైద్య, పర్యాటక రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని ఐదు స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా భద్రతను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు సంక్షేమ పథకాల చెక్కులు పంపిణీ చేయగా, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు: నిర్మల జగ్గారెడ్డి



**సంగారెడ్డి, మే 2:** సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్ లో నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో మహిళలకు ఉచితంగా మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ కలెక్షన్ వంటి సం క్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమ ర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయ డమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిం చేందుకే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు 195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్డివో జ్యోతి, ఆర్డిఓ రాజేందర్, సంగారెడ్డి , సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత, అంజమ్మ, మున్సిపల్ కౌన్సిలర్ లు ,సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయక్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి, శివాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## ప్రజలు ఎండ తీవ్రత నుండి జాగ్రత్తలు పాటించాలి

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తాజా మాజీ సర్పంచ్ కేదార్నాథ్ పటేల్



**రాయికోడ్, మే 2 :** సంగారెడ్డి జిల్లా మండల ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఎండల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తాజా మాజీ సర్పంచ్ కేదార్నాథ్ పటేల్ స్పష్టం చేశారు ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఇటీవల అధిక ఎండల కారణంగా ఒక ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతి అయిన సంఘటనను ప్రస్తావిస్తూ, వాహనాలను నేరుగా ఎండలో పార్క్ చేయకుండా చెట్ల నీడలో లేదా షెడ్లలో ఉంచాలని సూచించారు. వాహనాల్లో ఇంధనం, బ్యాటరీలు వంటి భాగాలు అధిక వేడికి గురై ప్రమాదాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. ప్రజలు ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం, చల్లని నీరు తరచుగా తాగడం, ఎలక్ట్రోలైట్ పానీయాలు సేవించడం ద్వారా డీహైడ్రేషన్ నుంచి రక్షించుకోవాలని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండల వల్ల అలసట, తలనొప్పి, తల తిరగడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. ఎండల్లో ట్రాఫిక్ నియంత్రణ విధులు వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. వీరు తరచుగా నీరు తాగుతూ, అవసరమైతే నీడలో విశ్రాంతి తీసుకుంటూ, తలకు క్యాప్ లు, గుడ్డలు ఉపయోగించడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో, చెత్త గుట్టల వద్ద అజాగ్రత్తగా మంటలు వేయకుండా ఉండాలని సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తాజా మాజీ సర్పంచ్ కేదార్నాథ్ పటేల్ స్పష్టం చేశారు.

# ప్రతి పల్లెకు సంక్షేమం చేరాలి

### నారాయణపేట అదనపు కలెక్టర్ శ్రీను



**నారాయణపేట, మే 2:** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు లబ్ధి చేకూర్చాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు. జిల్లాలో కొత్తగా ఎన్నికైన 272 మంది సర్పంచులు, 72 మంది మున్సిపల్ కౌన్సిలర్లలో చాలా మంది చదువుకున్న వాళ్ళు ఉన్నారని,గ్రామాలు, వార్డులలో మంచి పరిపాలన అందించి తమను ఎన్నుకున్న ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్స్ లో శనివారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా నియోజక వర్గ స్థాయి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్ డీ సీ/ఇన్ ఛార్జీ ఆర్డీవో రాజేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి,జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు,ఆర్టీవో మేఘా గాంధీ, సీపీవో ఖాఘవాహన్, మున్సిపల్ కమిషనర్ శంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని నోడల్ అధికారి రాజేందర్ గౌడ్ చదివి వినిపించారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ.. గత మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా జిల్లాలో మార్చి 6 నుంచి ఇప్పటి వరకు 10 థీమ్స్ తో జిల్లాలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. 99 రోజుల కార్యాచరణ పై అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో మార్చి 12 న ప్రజా ప్రతినిధులందరికీ ఒకరోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించామని ఆయన తెలిపారు. అలాగే ప్రతీ వారం ఒక్కో అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఏప్రిల్ 2 న జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు, వార్డులలో కౌన్సిలర్ల అధ్యక్షతన గ్రామ, వార్డు సభలు నిర్వహించుకున్నామని, 12న మండల స్థాయిలో, ఈ రోజు నియోజక వర్గ స్థాయిలో, ఈ నెల 26 న జిల్లా స్థాయిలో, జూన్ 2న రాష్ట్రస్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ వెల్లడించారు. అయితే కొత్తగా ఎన్నికైన సర్పంచులకు పంచాయతీ రాజ్ చట్టంపై మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, తన సర్వీసులో ఎప్పుడూ ఇలాంటి శిక్షణ కార్యక్రమం చూడలేదన్నారు. ప్రజలకు మంచి పాలన అందిస్తారని ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గ్రామాలలో, వార్డులలో ప్రజా ప్రతినిధులుగా మీ ముద్ర ఉండాలని సర్పంచులు, కౌన్సిలర్లకు ఆయన సూచించారు. గ్రామ, మండల, ప్రస్తుతం నియోజక వర్గ స్థాయి లో జరిగిన ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధి పొందుతున్న వారి వివరాలు, ఆయా పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో కూడిన నివేదికలను చాలా స్పష్టంగా వివరించారని చెప్పారు. రైతు భరోసా, మహా లక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాల గురించి వివరించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలతో పాటు జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మరికొన్ని పథకాలను ప్రవేశ పెట్టే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇది వరకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం తో పాటు అల్పాహారం కూడా ప్రవేశపెట్టనుందని, అలాగే పాఠశాల స్థాయి వరకే అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. వీటితో పాటు కొత్తగా కుటుంబ బీమా పథకం అమలు చేయనుందని, పంటల మార్పిడి/సేంద్రియ వ్యవసాయ, అలాగే వికలాంగులు, విద్యార్థులకు వాహనాలు పంపిణీ చేసే అవకాశం కూడా ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయబోయే సంక్షేమ పథకాలను అధికారులు ప్రజాప్రతినిధులు కలసి అర్హులకు లబ్ధి చేకూర్చాలని ఆయన పునరుద్ఘాటించారు. ఇక జిల్లాలో ఈ సీజన్ వరి ధాన్యం సేకరణకు 162 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, జూన్ నెలాఖరు వరకు ఆయా కేంద్రాలలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు చేసిన 24 గంటల లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని అదనపు కలెక్టర్ తెలిపారు. గతేడాది జరిగిన లోటు పాట్లను అధిగమించి ఈ సారి కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు జన గణన కొనసాగుతుందని, ఎనిమిరేటర్స్ ప్రతీ ఇంటికి వెళ్ళి ఆయా కుటుంబాల వివరాలు నమోదు చేస్తారని, అంతలోపు ఎవరికి వారే ఆన్ లైన్ లో స్వీయ గణన చేసుకుంటే హౌసింగ్ లిస్ట్ పూర్తవుతుందన్నారు. స్వీయ గణన చేసుకుని, ఐ.డీ. నెంబర్ సేవ్ చేసుకుంటే మన ఇంటికి ఎనిమరేటర్ వచ్చినప్పుడు కేవలం మన ఐడీ నంబర్ చెబితే మన వివరాలన్నీ ఎనిమరేటర్ సులువుగా నమోదు చేసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. స్వీయ గణన లో రాష్ట్రంలో మిగతా జిల్లాల కంటే మన జిల్లా చాలా వెనుక బడి ఉందని, సర్పంచులు, కౌన్సిలర్లు స్వీయ గణన పై అవగాహన కల్పించి, ఆన్ లైన్ లో వారి వివరాలను నమోదు చేయించాలని ఆయన కోరారు. జిల్లాలో ఈ సారి పదో తరగతి పరీక్షా ఫలితాలు మెరుగ్గా వచ్చాయని, గతేడాది 95 శాతం ఉత్తీర్ణత ఉంటే ఈ సారి 98 శాతానికి పెరిగిందని, ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో నాగర్ కర్నూల్ జిల్లాను మన జిల్లా ఉత్తీర్ణత శాతంలో వెనక్కి నెట్టిందని చెప్పారు. ప్రభుత్వం విద్య పై పెడుతున్న పెట్టుబడి వృథాగా పోదని ఆయన అభిప్రాయ పడ్డారు. జిల్లాలోని మక్తల్ నియోజక వర్గంలో గొల్లపల్లి శివారులో 20 ఎకరాలలో, అలాగే నారాయణ పేట మండలం లోని లింగంపల్లి వద్ద 20 ఎకరాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మించబోతుందని, ఆ పాఠశాలలు ప్రారంభమైతే పదో తరగతి పరీక్షా ఫలితాలలో మన జిల్లా మరింత ప్రగతి సాధించడం ఖాయమని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచిస్తూ.. ఉదయం 11 గంటలలోపు పనులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లాలని, ప్రతీ గ్రామంలో ఒక చలి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

వేసవిలో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్ళి తగిన చికిత్స తీసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం పలువురు చేనేత కార్మికుల కు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు అమరేందర్ కృష్ణ,తిరు పతయ్య, సింధుజా, రామ్ కోటి, ఆయా మండలాల ఎంపీడీ వోలు, ఏఈలు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, నియోజక వర్గానికి చెందిన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన విజయవంతానికి సమన్వయంతో ముందుకు..

- పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- స్వీయ గణనపై స్పందన తక్కువ -- 4 రోజుల్లో 50 వేల నమోదు లక్ష్యం
- ప్రతి గ్రామం, వార్డులో కనీసం 100 కుటుంబాలు స్వీయ గణన చేయాలి
- ప్రభుత్వ సిబ్బంది, సంస్థల ఉద్యోగులు 100% స్వీయ గణన పూర్తి చేయాలి
- స్వీయ గణన 2027 పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, మే 2:** జిల్లాలో సెన్సస్ 2027 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) జె. అరుణ శ్రీ, డీసీపీ రామ్ రెడ్డి తో కలిసి సెన్సస్ 2027 పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 1881 సంవత్సరం నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్నామని, కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికీ ఇప్పుడు 16వ జనగణన చేపడుతున్నామని తెలిపారు. సర్వేలకు భిన్నంగా సెన్సస్ చట్టబద్ధ ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలు ఇవ్వాలని, ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు. జనగణనను రెండు దశల్లో నిర్వహిస్తామని తెలిపారు. మే 11 నుండి జూన్ 9 వరకు మొదటి దశగా హౌస్ లిస్టింగ్ చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు సేకరిస్తామని చెప్పారు. నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, ఆహార ధాన్యాల వినియోగం వంటి అంశాలను నమోదు చేస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం 1548 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించగా, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 మంది జనాభా ఉంటుందని పేర్కొన్నారు. రెండో దశగా 2027 ఫిబ్రవరి-మార్చి నెలల్లో జనాభా గణన నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం ప్రక్రియ డిజిటల్ విధానంలో జరుగుతుందని, డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని స్పష్టం చేశారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించామని, se.census.gov.in వెబ్‌సైట్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు అనంతరం 11 అంకెల ప్రత్యేక నంబర్ వస్తుందని, ఆ నంబర్‌ను ఎన్యుమరేటర్‌కు ఇవ్వాలని సూచించారు. తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు స్వీయ గణనపై స్పందన చాలా తక్కువగా ఉందని, సుమారు 10 వేల మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ కేవలం 1500 నమోదులు మాత్రమే జరిగాయని తెలిపారు. ఇది ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ఉద్యోగులు తక్షణమే స్వీయ గణన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టీపీసీ, కేశోరం, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి సంస్థలలో 100 శాతం స్వీయ గణన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామ స్థాయిలో ఎంపీడీవోలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ సిబ్బంది స్వీయ గణన చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో కనీసం 100 కుటుంబాలు, మున్సిపాలిటీల్లో ప్రతి వార్డులో కనీసం 100 కుటుంబాలు స్వీయ గణన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సివిల్ సప్లైస్ అధికారులు రేషన్ డీలర్ల ద్వారా, డీఆర్‌డీఓ అధికారులు స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రతి సంఘంలో కనీసం 3 మంది నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ శాఖ ఫీల్డ్ సిబ్బంది, వ్యవసాయ శాఖ ఏఈఓలు రైతు వేదికల ద్వారా అవగాహన కల్పించి కనీసం 15 మంది నమోదు చేయించాలని సూచించారు. కాలేజీ విద్యార్థులు కూడా స్వీయ గణనలో పాల్గొనేలా చైతన్యం కల్పించాలని కోరారు. వచ్చే 4 పని దినాల్లో 50 వేల స్వీయ గణన నమోదు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సురేష్, బి. గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్



**మహబూబ్‌నగర్ మే 2:** మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతోందని తెలిపారు. మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని చెప్పారు. త్వరలో "ఇందిరమ్మ జీవిత బీమా" అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ ఖుష్బూ గుప్తా పథకాల అమలుపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్పి డి జానకి రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 9 గంటల్లోనే చోరీ నగదు రికవరీ




**పెద్దముల్ మండలం, మే 2:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం బండమీదిపల్లి గ్రామంలో చోటుచేసుకున్న బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదిం చారు. ఫిర్యాదు అందిన కేవలం 9 గంటల వ్యవధిలోనే దొంగిలించబడిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పెద్దేముల్ ఎస్సై ఎం. ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

**కేసు వివరాలు:**గ్రామానికి చెందిన నస్రీన్ బేగం అనే మహిళ మే 1వ తేదీ రాత్రి తన ఇంట్లోని బీరువాలో సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలను భద్రపరుచుకుంది. ఈరోజు (మే 2) ఉదయం 7 గంటలకు ఆమె తన ఇంటికి తాళం వేసి ఉపాధి హామీ పనులకు వెళ్ళింది. తిరిగి ఉదయం 9 గంటల సమయంలో వచ్చి చూడగా, ఇంటి తాళం తీసి ఉండటం గమనించి ఆందోళనతో లోపలికి వెళ్లింది. బీరువా తెరిచి ఉండటంతో పాటు అందులో ఉన్న బంగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించిన ఆమె వెంటనే పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

**పోలీసుల దర్యాప్తు – సిసి కెమెరాల కీలకం:**బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదే సమయంలో గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహమ్మద్ ఖాజా పాషా (31)ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**నేరం అంగీకారం – రికవరీ:**నిందితుడిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, తనే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. దొంగిలించిన రెండు తులాల బంగారు ఆభరణాలను పోలీసులకు అప్పగించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై చట్టరీత్యా తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## మహిళలకు రక్షణగా భరోసా సెంటర్ సేవలు




**నారాయణపేట, మే 2:** నారాయణపేట: జిల్లా కేంద్రంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భరోసా సెంటర్ బృందం మరియు మహిళా ఎస్సై శిరీష ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రైతులు, ఆటో డ్రైవర్లు, ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండర్ సమానత్వం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా భరోసా సెంటర్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మహిళల రక్షణ కొరకు పనిచేస్తుందని తెలియజేశారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండా ల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా మహిళా ఎస్సై శిరీష మాట్లాడుతూ... సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా మహిళ లు మరియు పిల్లల రక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను లేదా భరోసా సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శారద, రాధిక, నాగలక్ష్మి, ప్రమీలతో పాటు పలువురు మహిళలు, ఆటో డ్రైవర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.






# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలి

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయంలో మెమోరండం అందజేసిన
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి- గంటి సురేష్ కుమార్



**కొడంగల్ మున్సిపల్,(మం) మే 2:** కోడంగల్ నియోజకవర్గ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి గత లోపాలను సరిదిద్దుకుని రైతాంగానికి నష్టం వాటిల్లకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొడంగల్ మండల తహసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్రా రైతు సంఘం ఆధ్వర్యంలో మెమోరండం అందించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమైనవని ఇప్పటికే ధాన్యం కొనుగోలు ఎప్పుడు ప్రారంభిస్తారో అని రైతులు ఎదురుచూస్తున్నారు, ధాన్యం కొనుగోలు ప్రారంభించక పోవడంతో గతంలో మాదిరిగా అకాల వర్షాల మూలంగా ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉ ఒదన్నారు.వెంటనే కొనుగోలు ప్రారంభిస్తే ఎలాంటి ఇబ్బంది జరగకుండా త్వరగా కొనుగోలు చేస్తే రైతులకు ఉపయోగం జరుగుతుందని దీనికోసం అధికార యంత్రాంగం చొరవ చూపాలన్నారు. నెలల తరబడి ధాన్యం రాశులు మార్కెట్ కేంద్రాల్లో నిలువ ఉండడంతో రైతులకు కిరాయి ఎక్కువై ధాన్యం తడిసి రంగు మారుతుండడంతో రైస్ మిల్లు యజమాన్యం కోతలు విధించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ ఉందని ఆర్థికంగా రైతు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని, గన్నీ బ్యాగుల కొరతను నివారించాలని మార్కెట్లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే అమ్ముకునేందుకు రైతులు కష్టపడవలసి వస్తుందని అన్నారు, ఒకవైపు ఎండలు తీవ్రంగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని అన్నారు, వరి ధాన్యం కొనుగోలులో రైతులకు తరుగు పేరుతో ఎక్కువ ధాన్యం తీసుకుని నష్టం చేస్తే రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు, ఈ కార్యక్రమంలో సాయప్ప, హుస్సేన్, రాజు నాయక్, పాండు నాయక్, పవన్, రాజు, బాబా తదితరులు పాల్గొన్నారు.

# 41 ఏళ్ల నిష్కళంక సేవలు అభినందనీయం

**ఎస్సై ఆర్.గోపాల్ పదవీ విరమణ వేడుకలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్**



**వికారాబాద్, మే 2:** పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విశేష సేవలు అందించిన డిఎస్‌బి (ఋాదీ) సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపాల్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్, గోపాల్ ను శాలువాతో సత్కరించి, ఆయన సేవలకు గుర్తుగా జ్ఞాపికను అందజేశారు. పోలీసు శాఖలో ఆయన పోషించిన పాత్రను, అంకితభావాన్ని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా, ముఖ్యంగా పోలీస్ శాఖలో 41 సంవత్సరాల పాటు నిష్కళంకమైన సేవలు అందించడం అనేది సామాన్యమైన విషయం కాదని కొనియాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, క్రమశిక్షణతో విధి నిర్వహణలో నిబద్ధతను చాటుకున్న గోపాల్ ప్రయాణం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయన కనబరిచిన చొరవ, వృత్తి పట్ల ఆయనకున్న గౌరవం తోటి సిబ్బందికి, యువ పోలీసు అధికారులకు ఆదర్శప్రాయమని ఆమె సూచిం చారు. అనంతరం ఎస్పీ గోపాల్ గారి భవిష్యత్తు గురించి ఆకాంక్షిస్తూ.. సుదీర్ఘ కాలం పాటు సమాజ సేవలో బిజీగా గడిపిన ఆయన, ఇకపై తన కుటుంబ సభ్యులతో కలిసి పూర్తి ఆరోగ్యంతో, ప్రశాంతమైన శేష జీవితాన్ని గడపాలని కోరుకున్నారు. కుటుంబ బాధ్యతలను నెరవేర్చుకు ంటూనే, సమాజం పట్ల బాధ్యత కలిగిన పౌరుడిగా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ వీడ్కోలు వేడుకలో ఏఓ ఖాజా మోహినోద్దీన్, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ పాల్గొని గోపాల్ తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు డిపిఓ ఋూ) సిబ్బంది పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

**వికారాబాద్ లోని పలు జిల్లాలోని పలు నియోజక వర్గాల్లో...**

**పోలీస్ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు**



**వికారాబాద్, మే 2:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా లి"బాలల భద్రత, రక్షణ డ్రగ్స్ రహిత సమాజం" పైన వికారాబాద్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పోలీస్ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతిభద్రతలు, సామాజిక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తాండూరు పట్టణంలో ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, బాల్య వివక్షపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు, విద్యార్థినులకు మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ వంటి క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పరిగి నియోజకవర్గంలో డీఎస్పీ మరియు ఎస్సై ఆధ్వర్యంలో 'అరైవ్ – అలైవ్' పేరుతో రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, సిసి కెమెరాల ప్రాముఖ్యత మరియు మాదకద్రవ్యాల వ్యతిరేకతపై ప్రజలను చైతన్య పరిచారు. అలాగే దోమ ఎస్సై బాసపల్లి గ్రామంలో మహిళా భద్రత, సైబర్ క్రైమ్ అంశాలపై సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. మండలాల వారీగా పరిశీలిస్తే, చెం గోముల్ మరియు దుద్యాల్ ఎస్సై లు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. కోట్ పల్లి ఎస్సై మైసమ్మ ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ నిబంధనలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. కులకచర్ల ఎస్సై తన సిబ్బందితో కలిసి రోడ్డు భద్రత, సైబర్ అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించగా, బొంరాస్‌పేట మండలం జాంకంపల్లిలో కూడా అవగాహన సదస్సులు జరిగాయి. కొడంగల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో "షీ" టీమ్స్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొని ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నవాబ్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏహెచ్‌టీయూ (ఋాఋఖ), "షీ" టీమ్, భరోసా కేంద్రం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (జఔజ) మరియు యంగిస్తాన్ ఫౌండేషన్ సహకారంతో "బాల పంచాయతీ" కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు, అధికారులు పాల్గొన్న ఈ సదస్సులో బాలల హక్కులు, రక్షణ గురించి వివరించారు. బంట్వారం ఎస్సై సల్బాతాపూర్ గ్రామంలో బాల్య వివాహాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు తమ తమ పరిధుల్లో ప్రజలకు చేరువవుతూ, ప్రగతి ప్రణాళికలో చురుగ్గా పాల్గొని శాంతియుత సమాజ స్థాపనకు కృషి చేస్తున్నారు.

# ప్రజా భాగస్వామ్యంతో 99 రోజుల కార్యాచరణ అమలు





**మంచిర్యాల, మే 2:** ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పెన్షన్లు అందిస్తున్నామని, చౌక దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కొనసాగుతోందన్నారు. రైతులకు రైతు భరోసా, రైతు బీమా పథకాల అమలుతో పాటు మద్దతు ధరలతో కొనుగోలు కేంద్రాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులకు బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని, పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులకు ఆర్థిక సాయం అందుతున్నదని పేర్కొన్నారు. వేసవిలో త్రాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

విద్యారంగ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పాఠశాలల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం పురోగతిలో ఉందన్నారు. ఆరోగ్య రంగంలో మెరుగైన సేవలు అందిస్తూ జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం వేగంగా సాగుతోందని తెలిపారు. ఎంఎల్ఏ కొక్కిరాల ప్రేమసాగర్ రావు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను సమన్వయంతో అమలు చేయాలని, సమస్యల శాశ్వత పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. స్థానికంగా మెరుగైన వైద్య, విద్యా సదుపాయాలు అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## లవ్లీ చిత్రం



## మరో వివాదంలో త్రిష



## లావణ్య త్రిపాఠి సతీ లీలావతి ట్రైలర్ రిలీజ్



మెగా కోడలు లావణ్య త్రిపాఠి నటిస్తున్న తాజా చిత్రం సతీ లీలావతి ట్రైలర్ విడుదలై ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్న ఆ సినిమాను భీమిలి కబడ్డీ జట్టు, ఎస్ఎమ్ఎస్ చిత్రాలతో గుర్తింపు పొందిన తాతినేని సత్య తెరకెక్కిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రూపొందిన ఆ మూవీ మే 8న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఆ సినిమా ట్రైలర్ ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ విడుదల చేయడం విశేషం. ట్రైలర్ ప్రారంభంలోనే సీనియర్ నటుడు నరేష్ చెప్పే ఎమోషనల్ డైలాగ్ ఆకట్టుకుంటుంది. “20 ఏళ్ల నా పెంపకంలో కనబడని నవ్వు.. మూడేళ్ల మీ సంసార జీవితంలో కనిపిస్తుంది” అంటూ చెప్పే మాటలతో కథలోని భావోద్వేగాన్ని పరిచయం చేశారు. ఆ తర్వాత కథ ఫన్నీగా ముందుకు సాగుతుంది. భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు, అలకలు, ఇగో సమస్యల నేపథ్యంలో కథ నడుస్తుంది. ఇందులో లావణ్య లీలావతి పాత్రలో కనిపించి తన నటనతో మెప్పించారు.

సినిమా షూటింగ్ పూర్తయ్యాక ప్రమోషన్స్ లో పాల్గొనడం హీరోహీరోయిన్ల బాధ్యతగా మారిపోయిన ప్రస్తుత రోజుల్లో, అదే అంశంపై మరోసారి చర్చ మొదలైంది. తాజాగా కరుప్పు సినిమా ఆడియో లాంచ్ సందర్భంగా చోటుచేసుకున్న వివాదం ఇప్పుడు కోలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఆ వ్యవహారంలో త్రిష కృష్ణన్, మూవీ టీమ్ మధ్య చిన్న మాటల యుద్ధం పెద్ద చర్చకు దారి తీసింది. సూర్య హీరోగా, ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కరుప్పు మే 14వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా రిలీజ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ ప్రమోషన్స్ వేగం పెంచిన మేకర్స్ ఇటీవల గ్రాండ్ గా ఆడియో లాంచ్ నిర్వహించారు. అయితే ఆ కార్యక్రమానికి హీరోయిన్ త్రిష హాజరుకాకపోవడం వివాదానికి కారణమైంది. మొదట్లో త్రిష ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటోందనే విమర్శలు వచ్చాయి. షూటింగ్ పూర్తయితే చాలు.. ప్రమోషన్స్‌కు రావడం లేదంటూ సోషల్ మీడియాలో నెటిజన్స్ కామెంట్లు చేశారు. ముఖ్యంగా స్టార్ హీరోయిన్లు ఇలా చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ అసలు ట్విస్ట్ అక్కడే వచ్చింది. త్రిష తన సోషల్ మీడియా రిప్లై ద్వారా అసలు విషయాన్ని పరోక్షంగా బయటపెట్టారు. సినిమా టీమ్ ఆమెకు ఆడియో లాంచ్ కు అధికారికంగా ఆహ్వానం పంపలేదని ఇన్ డైరెక్ట్ గా చెప్పారు. ఇటీవల విడుదలైన త్రిష ఫస్ట్ లుక్ వీడియోకు ఒక అభిమాని ‘సినిమాలో త్రిష ఉందన్న విషయం మర్చిపోయాను’ అని కామెంట్ చేయగా, దానికి త్రిష ‘నేనూ మర్చిపోయాను..

## రారా ధీవర.. ‘స్వయంభూ’ సాంగ్ అదిరింది!

టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర ఇప్పుడు రొటీన్ సినిమాలు వర్కవుట్ అవ్వడం లేదు. అందుకే హీరోలు పీరియడ్ డ్రామాలు, చారిత్రక నేపథ్యం ఉన్న కథలపై ఫోకస్ పెడుతున్నారు. ఈ క్రమంలోనే నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న భారీ ప్రాజెక్ట్ ‘స్వయంభూ’ మీద అందరి కళ్లు పడ్డాయి. ఈ సినిమా నుంచి ఏదైనా అప్‌డేట్ వస్తే అది నెట్టింట ట్రెండ్ అవుతోంది. తాజాగా విడుదలైన ఈ చిత్రంలోని మొదటి పాట ఇప్పుడు మ్యూజిక్ లవర్స్ ను గట్టిగానే ఆకట్టుకుంటోంది. ‘రారా ధీవర’ అంటూ సాగే ఈ పాట ఇప్పుడు స్పాటిఫై వంటి ప్లాట్‌ఫామ్స్ లో టాప్ లో ట్రెండ్ అవుతోంది. రవి బస్రూర్ అందించిన మ్యూజిక్ కు ఆడియన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. సంతోష్ వెంకీ గొంతులో ఈ పాట వింటుంటే తెలియని ఎనర్జీ వస్తోంది. రామజోగయ్య శాస్త్రి తన కలం నుంచి వచ్చిన ఈ పవర్‌ఫుల్ పదాలతో ఈ సాంగ్ లో ఇంటెన్సిటీని పెంచారు. ఇక విజువల్స్ విషయానికి వస్తే, విజయ్ బిన్ని మాస్టర్ కంపోజ్ చేసిన స్టెప్పులు నిఖిల్ మేకోవర్ కు పక్కాగా సెట్ అయ్యాయి. నిఖిల్ తో పాటు సంయుక్త మీనన్, నభా నటేష్ కూడా ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



## నా ముందే బికినీ వేయ్ అన్నాడు



సినీ పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనుభవాలు అప్పుడప్పుడు బయటకు వస్తూనే ఉంటాయి. తాజాగా టాలీవుడ్ హీరోయిన్, ప్రముఖ హిందీ టీవీ నటి మదాలస శర్మ తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని మీడియాతో షేర్ చేసారు. కెరీర్ ఆరంభంలో ఒక ప్రముఖ దర్శకుడు తనను కలిసినప్పుడు ప్రవర్తించిన తీరు గురించి మదాలస ఒక ఇంటర్వ్యూలో వివరించారు. తాను కేవలం 19 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఒక సినిమా ఆడిషన్ కోసం వెళితే.. ఆ దర్శకుడు తన పట్ల అభ్యంతరకరంగా వ్యవహరించారని మదాలస పేర్కొన్నారు. సినిమా కథ ప్రకారం బికినీ సీన్ ఉంటుందని.. అయితే తాను కెమెరా ముందు బికినీలో ఎలా ఉంటానో.. తన బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటుందో చూడటానికి తన ముందే బికినీ వేసుకోవాలని సదరు దర్శకుడు కోరాడని మదాలస తెలిపారు. ఒక ప్రొఫెషనల్ మీటింగ్‌లో దర్శకుడు ఇలాంటి వింత కోరిక కోరడంతో తాను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారట. అయితే ఆ సమయంలో ఎంతో ధైర్యంగా, చాకచక్యంగా వ్యవహరించిన యువనటి ఆ దర్శకుడికి గట్టి సమాధానమే ఇచ్చారు. కథ డిమాండ్ చేస్తే కెమెరా ముందు బికినీ ధరించడానికి అయినా.. చీర కట్టడానికి అయినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది తన వృత్తిలో భాగమని మదాలస స్పష్టం చేశారు.

## ఒకే ఫ్రేమ్‌లో సల్మాన్ ఖాన్-సమంత?



సల్మాన్ ఖాన్ – సమంత ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే ఎలా ఉంటుంది? ఈ ఊహే ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక్కసారిగా అంచనాలను పెంచేస్తోంది. సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా రాజ్ అండ్ డీకే ఓ సూపర్ హీరో చిత్రాన్ని ప్లాన్ చేస్తు న్నారు. ఇప్పటికే కథ వినిపించగా? సల్మాన్ ఒకే చేసారు. అయితే ఆ కథలో కొన్ని మార్పులను సూచించారు. వాటన్నింటి పూర్తి చేసి పట్టాలెక్కించాలని దర్శకద్వయం ప్లాన్ చేస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో కథానాయికగా సమంతను ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదే నిజమైతే? సమంతకు బాలీవుడ్‌లో బిగ్గెస్ట్ ఎంట్రీ ఇదే అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సమంతకు, రాజ్ అండ్ డీకేలకు మధ్య మంచి అనుబంధం ఉంది. వీరి దర్శకత్వంలో రిలీజ్ అయిన ది ఫ్యామిలీ మ్యాన్ 2 వెబ్ సిరీస్‌తో సమంత నేషనల్ వైడ్‌గా గుర్తింపు తెచ్చుకుంది. రాజీ పాత్రలో సమంత నటనకు బాలీవుడ్ ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అటుపై వీరితోనే కలిసి సిటాడెల్: హనీ బన్నీ అనే మర భారీ సిరీస్‌లో నటించిన సంగతి తెలిసిందే. సమంతలోని నటన, డెడికేషన్ దర్శక ద్వయానికి బాగా నచ్చింది. ఈ నేపథ్యంలో సమంత –రాజ్ నిడిమోరు తో మరింత స్నేహాన్ని కొనసాగించి పెళ్లి వరకూ తీసుకెళ్లింది. ఇటీవలే వాళ్లిద్దరు పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో సమంతను కాదని రాజ్ నిడిమోరు మరో నాయిక వైపు ఎలా చూస్తాడు? సమంత బాలీవుడ్ లో సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో ఆశపడుతోంది.

## బోల్డ్ సీన్స్‌పై కియారా యూటర్న్



కియారా అద్వానీ కెరీర్లో టాక్సిక్ సినిమా కీలక మలుపుగా భావించవచ్చు. ఇప్పటి వరకు గ్లామరస్, రొమాంటిక్, కమర్షియల్ రోల్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఈసారి మరింత బోల్డ్, ఇంటెన్స్ పాత్రను ఎంచుకోవడం ఒక రిస్కీ స్టెప్‌గా కనిపిస్తోంది. ఇది ఆమెను కొత్త రేంజ్‌కి తీసుకెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశాన్ని కూడా విస్మరించలేం. ముఖ్యంగా సీన్ లెంగ్త్ లేదా ప్రెజెంటేషన్‌పై వచ్చిన తాజా గాసిప్‌లు, ఆమె కెరీర్ స్ట్రాటజీపై కొత్త చర్చలకు దారితీశాయి. ఈ సినిమాలో తాను నటించిన బోల్డ్ సీన్స్ ను ట్రిమ్ చేయాలని కృతి మేకర్స్ ను కోరినట్టు తెలుస్తోంది. షూటింగ్ టైమ్ లో ఈ సీన్స్ తన అనుమతితోనే జరిగినప్పటికీ, ఇప్పుడు ఫైనల్ అవుట్‌పుట్ చూశాక కృతికి ఇబ్బందిగా అనిపించి, తన డెసిషన్ ను మార్చుకున్నారని, అందుకే ఆ సీన్స్‌ను సినిమాలో నుంచి తొలగించాలని డైరెక్టర్ ను సంప్రదించినట్టు తెలుస్తోంది. సాధారణంగా సినిమా షూట్ సమయంలో నటీనటులకు స్క్రిప్ట్, సీన్ బ్లాకింగ్, కెమెరా ట్రీట్‌మెంట్ గురించి ముందుగానే అవగాహన ఉంటుంది. ముఖ్యంగా బోల్డ్ లేదా ఇంటిమేట్ సీన్స్ విషయంలో డైరెక్టర్, నటీనటుల మధ్య క్లియర్ కమ్యూనికేషన్ ఉంటుంది. అయితే, ఫైనల్ ఎడిట్‌లో సీన్ ఎలా కనిపిస్తుందో, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, కెమెరా యాంగిల్స్, ఎడిటింగ్ టెంపో, విజువల్ టోన్.. ఇవన్నీ కలిపి పూర్తిగా భిన్నంగా అనిపించే అవకాశముంది. ఈ కారణంగా కొన్ని సందర్భాల్లో నటీనటులు తమ కంఫర్ట్ జోన్‌ను మళ్లీ రీవాల్యుయేట్ చేయాలనుకుంటారు. కానీ కియారా విషయంలో ఇంటిమేట్ సీన్స్ కట్ అనేది ఎంతవరకు అమలు అవుతుందనేది పూర్తిగా మేకర్స్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది.





# ముంబై మళ్లీ ఢీలా

**చెన్నై అలవోక విజయం.. 8 వికెట్ల తేడాతో గెలుపు**

**రుతురాజ్, కార్తీక్ శర్మ అర్ధశతకాలు**

ఐపీఎల్ 2026లో చెన్నై సూపర్ కింగ్స్ అద్భుతమైన ప్రదర్శనతో అదరగొట్టింది. చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

**కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (67 నాటౌట్), కార్తీక్ శర్మ (54 నాటౌట్) అజేయ అర్ధశతకాలతో చెలరేగి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు. 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకి ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది.**

సంజూ శాంసన్ (11), ఉర్విల్ పటేల్ (24) త్వరగానే వెనుదిరిగారు. దీంతో 62 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ గైక్వాడ్, కార్తీక్ శర్మ ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 98 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పి మరో 11 బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. గైక్వాడ్ 48 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో, కార్తీక్ శర్మ 40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో రాణించారు. అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేయగలిగింది. నమన్ ధిర్ (57) ఒక్కడే అర్ధశతకంతో రాణించగా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 18) నెమ్మదిగా ఆడి నిరాశపరిచాడు. చెన్నై బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3 వికెట్లతో ముంబై పతనాన్ని శాసించగా, నూర్ అహ్మద్ 2 వికెట్లతో అతనికి సహకరించాడు. ఈ విజయంతో చెన్నై పాయింట్ల పట్టికలో మరింత ముందుకు దూసుకెళ్లింది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 8 | 6 | 1 | 13 |
| బెంగళూరు | 8 | 6 | 3 | 12 |
| హైదరాబాద్ | 9 | 6 | 3 | 12 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 9 | 5 | 4 | 10 |
| చెన్నై | 9 | 4 | 5 | 8 |
| ఢిల్లీ | 9 | 4 | 5 | 8 |
| కోల్‌కతా | 8 | 2 | 5 | 5 |
| ముంబై | 9 | 2 | 7 | 4 |
| లక్నో | 8 | 2 | 6 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు





## ఫ్రాంచైజీలకు బీసీసీఐ వార్నింగ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అన్ని ఫ్రాంచైజీలకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేసింది. ఇటీవల రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్, టీమ్ మేనేజర్ రోమీ భిందర్ నిబంధనలను ఉల్లంఘించిన ఘటనల నేపథ్యంలో బీసీసీఐ ఈ స్పష్టమైన సందేశాన్ని పంపింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆటగాళ్లు, సహాయక సిబ్బంది క్రమశిక్షణతో మెలగాలని, లీగ్ గౌరవాన్ని కాపాడాలని స్పష్టం చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో జరిగిన ఓ మ్యాచ్ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ వేపింగ్ చేస్తూ కెమెరాలకు పట్టుబడ్డాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, బీసీసీఐ తీవ్రంగా స్పందించింది. నిబంధనల ఉల్లంఘన కింద అతడికి రూ. 25 లక్షల భారీ జరిమానా విధించింది. అదే సమయంలో, మరో ఘటనలో, రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమీ భిందర్ డగౌట్‌లో మొబైల్ ఫోన్ వాడారు. ఇది పీఎంఓఏ (ప్లేయర్ అండ్ మ్యాచ్ అఫీషియల్స్ ఏరియా) ప్రోటోకాల్‌ను ఉల్లంఘించడమేనని నిర్ధారించిన బీసీసీఐ, అతనికి రూ. 1 లక్ష జరిమానా విధించింది. ఈ ఘటనలపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా శనివారం స్పందిస్తూ, "ఆటగాళ్లు, అధికారులు నిర్దేశించిన డెకోరమ్ (హోదా)ను కచ్చితంగా పాటించాలి. ఐపీఎల్ ప్రతిష్ఠకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. నిబంధనలు ఉల్లంఘించే జట్లపై భవిష్యత్తులో మరింత కఠినమైన చర్యలు తీసుకునేందుకు బీసీసీఐ ఇతర మార్గాలను అన్వేషిస్తోంది" అని తెలిపారు. ఐపీఎల్ నియమ నిబంధనలకు అనుగుణంగానే జట్లు నడుచుకోవాలని, ఉల్లంఘనలను అదుపు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా వేపింగ్ (ఎలక్ట్రానిక్ సిగరెట్ల వాడకం) 2019 చట్టం ప్రకారం నిషేధంలో ఉందని, ఈ విషయంలో పంజాబ్ పోలీసులు తమను సంప్రదించారా అని అడిగిన ప్రశ్నకు సైకియా "లేదు, అలాంటిదేమీ జరగలేదు" అని బదులిచ్చారు. కేవలం ఒక ఆటగాడు లేదా అధికారి మాత్రమే కాకుండా, జట్టు మొత్తం క్రమశిక్షణను కాపాడాల్సిన బాధ్యత ఫ్రాంచైజీలదేనని బీసీసీఐ తన ప్రకటనలో పేర్కొంది. ఈ తాజా హెచ్చరికలతో, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఫ్రాంచైజీలు మరింత జాగ్రత్త వహించనున్నాయి.

## పాత భువీ తిరిగొచ్చాడు

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) స్టార్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. 36 ఏళ్ల వయసులోనూ తన పాత పదును చూపిస్తూ వికెట్ల వేట సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్‌ను మళ్లీ భారత టీ20 జట్టులోకి తీసుకోవాలని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ సెలక్టర్లకు సూచించాడు. వయసును కాకుండా ప్రదర్శనను ప్రామాణికంగా తీసుకోవాలని అభిప్రాయపడ్డాడు. క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ సెహ్వాగ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "కొన్నిసార్లు వయసు కేవలం ఒక అంకె మాత్రమే అనిపిస్తుంది. అతనికి 35-36 ఏళ్లు ఉంటే ఏంటి? అద్భుత ప్రదర్శనలు ఇస్తున్నప్పుడు, టీ20 ఫార్మాట్‌లో తన పునరాగమనం గురించి అతను ఆలోచించాలి లేదా సెలక్టర్లు ఆలోచించాలి" అని సెహ్వాగ్ అన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్ జోడీని మళ్లీ టీమిండియాలో చూడవచ్చా అనే కోణంలో ఆలోచించాలని సూచించాడు. "మనం పాత భువనేశ్వర్‌ను మళ్లీ చూస్తున్నాం. అతని బౌలింగ్‌లో ఆ వాడి, వేడి స్పష్టంగా కనిపిస్తోంది. కొత్త బంతితో, పాత బంతితో కూడా అతను అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు" అని సెహ్వాగ్ ప్రశంసించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో భువనేశ్వర్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ఆర్‌సీబీ తరఫున ఆడిన కేవలం 9 మ్యాచ్‌లలోనే 17 వికెట్లు పడగొట్టి, పర్పుల్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో నిలిచాడు. గతేడాది (2025) ఆర్‌సీబీ టైటిల్ గెలిచిన సీజన్ మొత్తం మీద అతను 17 వికెట్లు తీయగా, ఈసారి కేవలం 9 మ్యాచ్‌లలోనే ఆ మార్కును అందుకోవడం అతని ఫామ్‌కు నిదర్శనం.





## నేడు కోల్‌కతాతో హైదరాబాద్ ఢీ

**ఉప్పల్‌లో మ్యాచ్.. మధ్యాహ్నం 12 గంటల ట్రాఫిక్ మళ్లింపు**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా ఆదివారం ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేశారు. మ్యాచ్ ఉండటంతో ఉప్పల్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉంటుంది. ఈ కారణంగా ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేస్తున్నారు. లారీలు, రాకెట్ లారీలు, డంపర్లు, ఎర్త్ మూవర్లు, ట్రక్కులు, టిప్పర్లు, వాటర్ ట్యాంకర్లు, ఆర్ఎంసీ వాహనాలు, జేసీబీలు, ఐషర్ వ్యాన్లు, ప్రైవేటు బస్సులు, ట్రాక్టర్లను అటు రాకుండా మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నాగోల్ నుంచి హబ్సిగూడ, బోడుప్పల్ నుంచి అంబర్‌పేట వరకు మోస్తరు ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంది. ఈ కారణంగా ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు. గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు వంటి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

### పార్కింగ్ ప్రదేశాలు

ఈ మ్యాచ్ కోసం ఐదు పార్కింగ్ ప్రాంతాలను సిద్ధం చేశారు. వీటిలో నాలుగు స్టేడియం బయట 500 పరిధిలో సాధారణ ప్రజలకు, స్టేడియం లోపల వీవీఐపీ, వీఐపీ పాస్ హోల్డర్లకు ఒక పార్కింగ్ ప్రాంతాన్ని కేటాయించారు. ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి హబ్సిగూడ వైపు పెంగ్విన్ (1), టీజీఐఏఎల్ఏ (2), ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి రామంతాపూర్ వైపు డీఎస్ఎల్ ఓపెన్ ప్రదేశం (3), మోడర్న్ బేకరీ (4) పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశారు.

### ట్రాఫిక్ మళ్లింపు

ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వచ్చే హెవీ వాహనాలు మెహఫిల్ హోటల్ వద్ద ఉప్పల్ భగాయత్ ప్రవేశద్వారం వద్ద నాగోల్ మీదుగా ఎల్బీనగర్ వైపు మళ్లిస్తారు.

ఎల్బీనగర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలు నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద యూటర్న్ తీసుకుని హెచ్ఎండీఏ భగాయత్ - టయోటా యూటర్న్ - బోడుప్పల్ - చెంగిచెర్ల - ఐవోసీఎల్ చెర్లపల్లి - ఘట్‌కేసర్ వైపు మళ్లిస్తారు.

తార్నాక నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలను హబ్సిగూడ క్రాస్ రోడ్డు వద్ద నాచారం - ఎన్ఎఫ్‌సీ రోటరీ - ఐవోసీఎల్ చర్లపల్లి - ఘట్‌కేసర్ వైపు మళ్లిస్తారు.

రామంతాపూర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలను వీధి నెంబర్ 8 వద్ద హబ్సిగూడ క్రాస్ రోడ్డు - నాచారం - ఎన్ఎఫ్‌సీ రోటరీ - ఐవోసీఎల్ చర్లపల్లి - ఘట్‌కేసర్ వైపు మళ్లిస్తారు.

వరంగల్ నుంచి ఉప్పల్ మీదుగా హైదరాబాద్ వచ్చే భారీ వాహనాలను ఘట్‌కేసర్ ఆర్ఆర్ వద్ద ఓఆర్ఆర్ మీదుగా అబ్దుల్లాపూర్‌మెట్, ఎల్బీనగర్ - దిల్‌సుఖ్ నగర్ మీదుగా మళ్లిస్తారు.

హైదరాబాద్ నుంచి ఉప్పల్ మీదుగా వరంగల్ వెళ్లే భారీ వాహనాలను ఎల్బీనగర్ - హయత్ నగర్ మీదుగా అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఓఆర్ఆర్ మీదుగా వరంగల్ చేరుకోవాలి.



## షరపోవాకు తగ్గని క్రేజ్

**ఇప్పటికీ ఎండార్స్‌మెంట్లతో భారీ ఆదాయం**

**టెన్నిస్ క్వీన్ ఆస్తి రూ.1490 కోట్లు**

రష్యన్ టెన్నిస్ గ్లామర్ క్వీన్, మాజీ వరల్డ్ నంబర్ వన్ క్రీడాకారిణి మారియా షరపోవా ఆటకు వీడ్కోలు పలికినప్పటికీ, సంపాదనలో మాత్రం దూసుకుపోతోంది. 2026 నాటికి ఆమె నికర ఆస్తి విలువ సుమారు 180 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1490 కోట్లు) ఉంటుందని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఆమె మొత్తం సంపాదనలో ఆట ద్వారా వచ్చిన ప్రైజ్ మనీ కేవలం చిన్న భాగం మాత్రమే. షరపోవా తన టెన్నిస్ కెరీర్‌లో ప్రైజ్ మనీ రూపంలో 38 మిలియన్ డాలర్లకు పైగా గెలుచుకుంది. అయితే, ఆమెకు సింహభాగం ఆదాయం బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, వ్యాపారాల నుంచే సమకూరింది. ముఖ్యంగా నైకీ, పోర్షే, ట్యాగ్ హ్యూయర్ వంటి ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లతో ఆమె కుదుర్చుకున్న భారీ ఒప్పందాలు ఆమెను అత్యంత సంపన్న క్రీడాకారిణుల్లో ఒకరిగా నిలబెట్టాయి. కేవలం ఎండార్స్‌మెంట్లకే పరిమితం కాకుండా, షరపోవా వ్యాపార రంగంలోకి కూడా అడుగుపెట్టి తన తెలివిని ప్రదర్శించింది. 2012లో ఆమె 'సుగర్‌పోవా' పేరుతో సొంతంగా క్యాండీ బ్రాండ్‌ను ప్రారంభించింది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 3-5-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

## తెలంగాణ ప్రగతికి ఊతం ఇచ్చేనా?

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జనాగ్రహ సభ' కేవలం రాజకీయ శక్తి ప్రదర్శనగానే కాకుండా, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక మలుపుగా మారాలని సామాన్య ప్రజానీకం ఆశిస్తోంది. దశాబ్ద కాలపు ఆకాంక్షల తెలంగాణలో, కేంద్రం నుంచి అందే సహకారం రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడంలో కీలకం. ఈ సభ ద్వారా తెలంగాణ ప్రజలు ప్రధానంగా ఆశిస్తున్నది విభజన చట్టంలోని పెండింగ్ హామీల పరిష్కారం. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం వంటి అంశాలపై ప్రధాని నుంచి సానుకూల ప్రకటన వెలువడితే అది రాష్ట్ర పారిశ్రామిక రంగానికి పెద్ద ఊరట నిస్తుంది. జాతీయ హోదా పొందిన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం తన వైఖరిని స్పష్టం చేస్తే, సాగునీటి రంగంలో తెలంగాణ మరింత వేగంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం పెద్దపీట వేస్తోంది. రీజినల్ రింగ్ రోడ్ వంటి భారీ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, రైల్వే నెట్‌వర్క్ పటిష్టతపై ప్రధాని చేసే ప్రసంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి మహానగరాన్ని గ్లోబల్ హబ్‌గా మార్చే క్రమంలో కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకాలు అత్యంత కీలకం. తెలంగాణలో నైపుణ్యం కలిగిన యువత అధికం. ఐటీ మరియు ఫార్మా రంగాల్లో రాష్ట్రం ఇప్పటికే అగ్రస్థానంలో ఉంది. ఈ సభ వేదికగా కేంద్రం నుంచి 'సెమీకండక్టర్ మిషన్' లేదా కొత్త ఐటీ కారిడార్లకు సంబంధించిన సానుకూల స్పందన వస్తే, అది వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుంది. రాష్ట్రంలో విద్యా సంస్థల బలోపేతానికి కేంద్ర సాయం పెరిగితే విద్యా రంగంలో సమూల మార్పులు వస్తాయి. రాజకీయ వైరుధ్యాలు ఎలా ఉన్నా, 'సబ్ కా సాత్ - సబ్ కా వికాస్' మంత్రంతో కేంద్రం తెలంగాణకు బాసటగా నిలవాల్సిన సమయం ఇది. రాష్ట్రంలోని సంక్షేమ పథకాలకు కేంద్ర నిధుల వాటా పెంచడం, పన్నుల వాటా పంపిణీలో న్యాయం వంటి అంశాలపై సానుకూల సంకేతాలు అందితే రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయి. జనాగ్రహ సభ కేవలం విమర్శల వేదికగా మిగిలిపోకుండా, తెలంగాణ అభివృద్ధికి ఒక 'రోడ్ మ్యాప్'గా నిలవాలి. ప్రధాని మోదీ ప్రసంగం రాష్ట్ర ప్రజల్లో భరోసా నింపేలా, కేంద్ర-రాష్ట్రాల మధ్య నిర్మాణాత్మక సంబంధానికి పునాది వేసేలా ఉండాలి.



## అన్నదాతను ఆదుకోవాల్సిన సమయం

భారతీయ వ్యవసాయం ఎప్పుడూ ప్రకృతితో ఆడే జూదమే. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితులు అన్నదాతను అయోమయంలో పడేస్తున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు 'ఎల్‌నినో' ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గే అవకాశం ఉందని హెచ్చరిస్తుంటే.. మరోవైపు భారత వాతావరణ శాఖ ఈసారి నైరుతి రుతుపవనాల ద్వారా సాధారణ వర్షపాతం నమోదవుతుందని భరోసా ఇస్తోంది. ఈ విరుద్ధమైన అంచనాల మధ్య సామాన్య రైతు అయోమయానికి గురికాకముందే ప్రభుత్వం అప్రమత్తమై, కార్యాచరణను సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో ప్రభావం వల్ల గతంలో అనేకసార్లు కరువు పరిస్థితులు ఎదురయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడం, జలాశయాల్లో నీటి మట్టం తగ్గడం వంటివి సాగును కుదేలు చేస్తాయి. ఐఎండీ అంచనాలు ఊరటనిస్తున్నప్పటికీ, వర్షాలు ఎలా ఉంటాయనేది అసలు ప్రశ్న. ఒకేసారి అతివృష్టి కురవడం లేదా సుదీర్ఘకాలం వర్షాలు లేకపోవడం వంటివి జరిగితే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో రైతులకు దిశానిర్దేశం చేయాలి. ముఖ్యంగా, వ్యవసాయ శాఖ ద్వారా జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు రైతులకు అవగాహన కల్పించాలి. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు, స్వల్పకాలిక రకాల విత్తనాల లభ్యతను ముందే పెంచాలి. ఒకవేళ రుతుపవనాలు మొహం చాటేస్తే అనుసరించాల్సిన 'అత్యవసర సాగు ప్రణాళిక' కాగితాలకే పరిమితం కాకుండా అమలుకు సిద్ధంగా ఉండాలి. అలాగే, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం పారదర్శకత పాటించాలి. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవడం, చెరువుల పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి. రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎక్కడా జాప్యం జరగకూడదు. ముఖ్యంగా క్రాప్ ఇన్సూరెన్స్ (పంట బీమా) పట్ల రైతుల్లో చైతన్యం నింపి, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే వారిని ఆర్థికంగా ఆదుకుంటామనే భరోసా ప్రభుత్వం కల్పించాలి.ప్రకృతి హెచ్చరికలను పెడచెవిన పెట్టడం ఆత్మహత్య సదృశమే. వాతావరణ మార్పుల నేపథ్యంలో అన్నదాతను అనాథను చేయకుండా, ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం అండగా నిలవాలి.

ఈ విరుద్ధ అంచనాల మధ్య, ముఖ్యంగా వర్షాధార సాగుపై ఎక్కువగా ఆధారపడే తెలంగాణ రైతాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. తెలంగాణలో వరి, పత్తి వంటి పంటలు అత్యధిక విస్తీర్ణంలో సాగవుతాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జూలై మాసాల్లో రుతుపవనాలు మందగిస్తే, విత్తనాలు వేసే సమయం మించిపోయే ప్రమాదం ఉంది. ఒకవేళ వర్షాలు ఆలస్యమైతే భూగర్భ జలాలు కూడా వేగంగా అడుగంటిపోతాయి. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎండలు మండిపోతున్నాయి. జలాశయాల్లో నీటి మట్టాలు ఆందోళనకరంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం కేవలం అంచనాలపైనే ఆధారపడకుండా 'ప్లాన్-బీ' తో సిద్ధంగా ఉండాలి.ముఖ్యంగా, తెలంగాణ ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలి. నీటి ఎద్దడిని తట్టుకునే స్వల్పకాలిక రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలి. పత్తి రైతులకు గులాబీ రంగు పురుగు ఉధృతి, వర్షాభావ పరిస్థితులపై క్షేత్రస్థాయి అధికారుల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేల సంఖ్యలో చెరువులను, 'మిషన్ కాకతీయ' ద్వారా పునరుద్ధరించిన వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రచించాలి.అంతేకాకుండా, ప్రాజెక్టుల ద్వారా అందే సాగునీటి పంపిణీలో పారదర్శకత ఉండాలి. చిట్టచివరి రైతుల వరకు నీరు అందేలా చూడాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూస్తూనే, రైతులకు అవసరమైన పెట్టుబడి సాయం, రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి. పంట బీమా పథకాన్ని బలోపేతం చేసి, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందేలా యంత్రాంగాన్ని సిద్ధం చేయాలి.ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎదురుచూడటం కంటే, ముందస్తుగా మేల్కొనడమే వివేకం. వాతావరణ మార్పుల నేపథ్యంలో తెలంగాణ అన్నదాతను అనాథను చేయకుండా, శాస్త్రీయమైన ప్రణాళికలతో ప్రభుత్వం అండగా నిలవాలి. అప్పుడే రాష్ట్ర వ్యవసాయ రంగం ఈ గండం నుంచి గట్టెక్కగలదు.

**- సత్యనారాయణ దురిశెట్టి, హైదరాబాద్, వ్యవసాయ నిపుణుడు**




నేటి విద్యా వ్యవస్థ విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడం కంటే, మార్కులు సంపాదించే యంత్రాలుగా మార్చడానికే ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచే ఐఐటీ, నీట్, ఏఐ అంటూ విద్యార్థులపై మోయలేనంత ఒత్తిడిని రుద్దుతున్నారు. పదేళ్ల వయసు కూడా నిండని పిల్లల మనసుల్లో 'ర్యాంకు రాకపోతే జీవితమే వ్యర్థం' అనే భయాన్ని నూరిపోస్తున్నారు. ఈ ధోరణి పిల్లల సహజత్వాన్ని చంపేయడమే కాకుండా, వారిని బలవన్మరణాలకు పురికొల్పుతుండటం అత్యంత ఆందోళనకరం. ఒకప్పుడు ఆటపాటలతో సాగాల్సిన బాల్యం, నేడు ఏసీ గదుల్లో గంటల తరబడి సాగే కోచింగ్ సెంటర్ల మధ్య బందీ అయిపోయింది.

## మార్కుల వేటలో మృత్యువాత



అలేఖ్య బొమ్మకంటి

'ర్యాంకులే మా లక్ష్యం' అనే కార్పొరేట్ సంస్థల ప్రచార ఆర్భాటంలో విద్యార్థులు కేవలం అంకెలుగా మారిపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతర క్లాసులు, వారాంతపు పరీక్షలు, ర్యాంకుల తారతమ్యాలతో పిల్లలు మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారు. తోటి విద్యార్థులను మిత్రులుగా కాక, శత్రువులుగా చూసే పోటీతత్వాన్ని చిన్ననాడే అలవరుస్తున్నారు. పరీక్షలో విఫలమైతే సమాజం ఏమనుకుంటుందో, తల్లిదండ్రులు ఎలా స్పందిస్తారో అనే భయం పిల్లలను ఆత్మహత్యల వైపు నడిపిస్తోంది. "విజయం సాధించకపోతే నీకు భవిష్యత్తు లేదు" అని పదే పదే చెప్పడం వల్ల, పరీక్షల్లో తక్కువ మార్కులు రాగానే తమ జీవితం ముగిసిపోయిందని విద్యార్థులు భావిస్తున్నారు. ప్రాణం కంటే మార్కులు ముఖ్యం కాదనే కనీస స్పృహను కలిగించడంలో అటు విద్యా వ్యవస్థ, ఇటు తల్లిదండ్రులు విఫలమవుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు కేవలం ఆ కుటుంబానికే కాదు, దేశానికే తీరని లోటు. ఈ ప్రమాదకర ధోరణికి అడ్డుకట్ట పడాలంటే విద్యా విధానంలో సమూల మార్పులు రావాలి. పాఠశాలలు ర్యాంకుల ప్రకటనలను నిలిపివేసి, ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక నైపుణ్యాన్ని గుర్తించాలి. పిల్లలపై తమ అంచనాలను రుద్దడం మానేయాలి. ఫలితం ఏదైనా తాము ఉన్నామనే భరోసాని ఇవ్వాలి. పాఠశాలల్లో విద్యతో పాటు ఒత్తిడిని ఎలా జయించాలో నేర్పించే 'కౌన్సెలింగ్' సెషన్లు తప్పనిసరి చేయాలి. జీవితం అంటే కేవలం ఐఐటీ, నీట్ మాత్రమే కాదు. పరీక్షలో ఫెయిల్ అవ్వడం అంటే జీవితంలో ఓడిపోవడం కాదు. ప్రతి చిన్నారిలోనూ ఒక ప్రతిభ ఉంటుంది. దాన్ని గుర్తించి ప్రోత్సహించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుంది. లేదంటే, మన పిల్లల బంగారు భవిష్యత్తును మనమే స్వహస్తాలతో చిదిమేసిన వాళ్లమవుతాం.

దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆత్మహత్యలు ఒక 'ఎపిడెమిక్' (మహమ్మారి) స్థాయికి చేరుకున్నాయని నిపుణులు, భారత సర్వోన్నత న్యాయస్థానం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. భారతదేశంలో సగటున ప్రతి గంటకు ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. 2023లో దేశవ్యాప్తంగా సుమారు 13,892 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు.

గత దశాబ్ద కాలంలో విద్యార్థి ఆత్మహత్యలు దాదాపు 65% పెరిగాయి. దేశంలో సాధారణ ఆత్మహత్యల రేటు 2% పెరుగుతుంటే, విద్యార్థుల ఆత్మహత్యల రేటు ఏటా 4% చొప్పున పెరుగుతోంది. ఐఐటీ, నీట్ వంటి ప్రవేశ పరీక్షల కోసం 14-15 ఏళ్ల నుంచే కోచింగ్ సెంటర్లలో గంటల తరబడి గడపడం వల్ల విద్యార్థులు తీవ్ర అలసటకు గురవుతున్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు మాత్రమే కావాలనే తల్లిదండ్రుల మొండి పట్టుదల, పిల్లల ఇష్టాయిష్టాలను పట్టించుకోకపోవడం వారిని ఒంటరిని చేస్తోంది.బంధువులు, స్నేహితులతో నిరంతరం పోల్చడం, సోషల్ మీడియాలో చూసే విజయాలే ప్రమాణాలుగా భావించడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతింటోంది. పరీక్షల్లో విఫలమవ్వడం అంటే జీవితంలో ఓడిపోవడమే అనే తప్పుడు సంకేతాలు సమాజం నుంచి వెళ్తున్నాయి. అయితే, 2025లో సుప్రీం కోర్టు అన్ని విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్ల కోసం 15 కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందులో విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారం బోర్డు పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి ఏడాదికి రెండుసార్లు పరీక్షలు రాసే అవకాశం కల్పించింది. ఇందులో విద్యార్థులు తమకు నచ్చిన అత్యుత్తమ మార్కులను ఎంచుకోవచ్చు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మానసిక మద్దతు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హెల్ప్‌లైన్, కౌన్సెలింగ్ సేవలను ప్రారంభించింది. ప్రతి పాఠశాలలో, కోచింగ్ సెంటర్లోనూ శిక్షణ పొందిన కౌన్సెలర్లు తప్పనిసరిగా ఉండాలి. మార్కుల వేట కంటే, విషయాన్ని అర్థం చేసుకోవడంపై దృష్టి పెట్టాలి.పిల్లల మార్కుల కంటే వారి మానసిక స్థితిని అర్థం చేసుకోవడం ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యా వ్యవస్థలో మార్కులు ఒక భాగం మాత్రమే, అవి జీవితాన్ని నిర్ణయించేవి కావని పిల్లలకు నిరంతరం భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉంది.

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.